శ్రీసచ్చిదానంద సద్గురు సాయినాథ్ మహారాజ్ కీ జై! సద్గురు శ్రీసాయినాథుని శరద్బాబూజీ కీ జై!



సాయి ప్రేమతత్త్వం



ప్రేమను ప్రేమించిన ప్రేమస్వరూపం

జన్మదిన సంచిక

*Simply he loves*

# గురుకృప


సద్గురువంటే .. ప్రేమ.. అంతే!

# సత్సంగంలో ఏం చేయమంటారు?

**భక్తుడు :** సత్సంగానికి వెళ్లినపుడు బాబా ప్రెసెన్స్, గురువుగారి ప్రెసెన్స్ ఎలా ఫీల్ అవ్వాలి?

**గురువుగారు :** బాబా కోసం మనం ఫీల్ అవ్వాల్సిన అవసరం లేదు. అట్లా ఫీల్ అవడంలో ఉపయోగం ఏమిటి? గమ్మున కూర్చుని ఉంటే అదే అవుతుంది. ఎండలో కూర్చొని ఎండని ఎట్లా ఫీల్ అవుతావు? నాకు ఆ టెక్నిక్ చెపితే నేను ఇది చెబుతా. అక్కడ మనం చేసే పని ఏంటనంటే బాబా నామం అనేటువంటి నీళ్ళతో మన ప్రేమ అనేటువంటి డిటర్జెంట్ వేసి, మన గుడ్డ అనేటువంటి మనస్సును ఉతికేసుకున్నాము. హ్యాపీగా కాసేపు కూర్చొని అక్కడ ఎండలో అట్లా ఆరేసాము. ఏం చేస్తుంది గుడ్డ ఎండటానికి? ఎండలో ఉండటం తప్పితే అది చేసేదేమీ లేదు అక్కడ అట్లా ఆ ఎండ ఉంటుంది? అటూ ఇటూ జారిపోకుండా ఒక ప్లేస్ పెట్టుకొని సత్సంగం అనేటువంటి దండెం వేసుకొని దానికి క్లిప్ చేసుకుంటాం అంతే! కాబట్టి ఒక గుడ్డ ఎండటానికి ఏం చేస్తుందో అదే మనం సత్సంగంలో చేసేది కూడా! బాబా దగ్గర మనం చేసేది కూడా.

ఆయన సన్నిధిలో ఉంటే ఆ అనుగ్రహం అనేటువంటి ఎండకి మనలో ఉండే పచ్చి అంతా పోతుంది.



అందుకని ఏం చేయమంటారు?

ఏం చేయమంటారంటే ఇదే చేయాల్సింది. అంతకంటే ఏమీ లేదు, ఎండండి.

**భక్తుడు :** సత్సంగాలు జరుపుకోవడానికి గైడ్‌లైన్స్ ఏమైనా చెప్పండి గురువుగారూ!

**గురువుగారు :** అన్నింటికంటే ముఖ్యమైన గైడ్‌లైన్ ఒకటే. సత్సంగాలు ఎందుకు చేసుకుంటున్నాం అనేటువంటి లక్ష్యాన్ని గుర్తుపెట్టుకోండి. సత్సంగం - బాబా స్మరణలో ఉంటూ బాబాకు మనల్ని మనం దగ్గర చేసుకునేటువంటి ప్రయత్నం మాత్రమే అనే విషయం గుర్తుపెట్టుకుంటే ఏ గైడ్‌లైన్స్ అవసరం లేదు. ఇవి మరచిపోయినపుడే వంద సమస్యలొస్తాయి. వంద గైడ్‌లైన్స్ వస్తాయి. - శ్రీబాబూజీ

సంపుటి : 17
జనవరి 1

సంచిక : 1
2014

# గురుకృప



## సాయివంటి దైవంబు లేడోయి... లేడోయి...

ప్రజలందరి నోట సాయినామం పలకాలి!
సర్వత్రా సాయిరూపం రంజిల్లాలి.
ముజ్జగాలు సాయి మహిమతో ముప్పిరిగొనాలి!
సాయిపద రవళులు మన హృదయ కుహరంలోని నిశ్శబ్ద నిశీథిలో
ప్రతిధ్వనించాలి. ప్రణవనాద వీచికల్లా సాయిజ్ఞాన సౌరభాలు
సర్వత్రా వ్యాపించాలి. ఆ సుజ్ఞాన సౌరభాల ఆస్వాదనలో
మన మనసులు మత్తెక్కాలి!
సాయి ప్రేమామృత ధారలు అంతటా నిరంతరం వర్షించాలి!
ఆ ప్రేమామృత ధారలలో తడుస్తూ, ఆ జ్ఞాన సౌరభాల మత్తులో
ఆనందంగా నర్తిస్తూ, 'సాయివంటి దైవంబు లేడోయి లేడోయి!'
అని అందరూ ఏక కంఠంతో గానం చేయాలి!
అదే నా ఆశ, ఆశయం, ఆకాంక్ష! అదొక మధుర స్వప్నం.
ఆ స్వప్న సాఫల్యం కోసం శ్రీసాయినాథుని అనన్య ప్రేమతో ఆర్ద్రతతో
ప్రార్థించడమే మనం చేయగలిగింది, చేయవలసింది.

- శ్రీబాబూజీ



## లోపలి పేజీలలో

స'మయం' 4
- గురుకృప

మన జీవితధ్యేయం 8
- శరచ్చంద్రికలు

ఉద్వేగ పడవద్దు - ఉద్వేగ పరచవద్దు 15
- పార్థసారథి ప్రవచనాలు

నిరాడంబరతకే ప్రాధాన్యం 20
- గురుకృప

శ్రీబాబూజీ 22
- సాయిదీవెన

ఒ'యాసిస్సు' గురుకృప 24
- శ్రీనివాస్

నిర్వహణ : **గురూజీ ఆశీస్సులతో - గురుబంధువులు**

**GURUKRUPA**
Printed at : Ramakrishna Printers, Visakhapatnam.

# స'మయం'



"ఎందుకొచ్చినట్లు, పిడకలేరుకోవడానికా? సద్గురువును తెలుసుకో". "భజగోవిందం.. భజగోవిందం... గోవిందం భజ మూఢమతే, సంప్రాప్తే సన్నిహితే కాలే..." సమయానికి సద్గురు మూర్తులు ఇచ్చిన ప్రాధాన్యత వారి మాటల్లోనే...

ఈ జగత్తుకు వచ్చిన నాటి నుండి బాల్యావస్థను తల్లిఒడిలో, బడిలో గడిపిన పిమ్మట, నేర్చుకున్న దేమయ్యా అంటే 'నేను' అన్న ఎరుక, 'నాది' అన్న అధికారం. అది మొదలు ప్రతీక్షణం – 'పిడకలేరుకునే' ప్రయత్నమే చేస్తున్నదంతా! పూజ్య గురుదేవులంటారు 'ఎందుకు బతుకుతున్నావురా అంటే మరణం రాలేదు కనుక'. ఇదీ మన నైజం. కనిపించిన ప్రతి ధాతువును నింపాను శరీరంలో, వినిపించిన ప్రతీ మాటను నింపాను మస్కిష్కంలో. మనిషి చేసేది ఇది. ఎన్నో లక్షల జీవరాసుల్లో కేవలం ఒక్క మనిషికి మాత్రం దైవం 'బుద్ధి'ని ప్రసాదించాడు. ఎందుకయ్యా అంటే "ఒరేయ్! కాలమనే కాలుడి చేతబడి, బ్రతుకు మూతబడి, మరో పుట్టుకకు పురుడు పోసుకోవడానికి కాదురా, నీకు బుద్ధినిచ్చింది, సమయాన్ని సద్వినియోగం చేసుకుని, సద్గురుమయం చేసుకో! నా పదసన్నిధిని చేరుకో అని!"

**సమయము – సమున్నతము**

**"యం లబ్ధ్వా చాపరం లాభం మన్యతే నాధికం తతః"** మనిషి జీవితంలో అత్యున్నతమైనది ఏది ఉన్నదో అది ఆశించవలెను. ప్రతి మనిషి అవసరాలు వేరు, ఆశలు వేరు, ఆశయాలు వేరు. అయితే ఏ గొప్ప సద్వస్తువు లభిస్తే ఇక దేని అవసరము ఉండదో, దేని పట్ల 'ఆశ' కలుగదో అది ఆశించుట శ్రేష్ఠమంటాడు గీతాచార్యుడు. మనిషిగా పుట్టడమే దుర్లభమైతే, సమున్నతమైతే మన ఆశయమెంత సమున్నతంగా ఉండాలి. జీవన లక్ష్యమెరుగని జీవి – మనుష్యుడన జాలడు, మనుష్యునిగా మనజాలడంటాడు మరోకవి! ముందు ఒక సమున్నత ఆశయముండాలి, ఆశయంకోసం అనుక్షణాన్ని సద్విని'యోగం' చేసుకునే తపన ఉండాలి. ఆంగ్ల వాచకమున 'టైమ్'కున్న అర్థమేమిటో తెలియదు కానీ, 'సమయము'నకు శపథమని, సిద్ధాంతమని, బుద్ధియని, ఆజ్ఞయన్న సమున్నత అర్థములను ఏర్పరిచిరి మన పెద్దలు. కాలానికున్న విలువ మనకు – గడిచిన కాలం అవసరమయితే కానీ తెలియదు. ఇదిగో, శ్రుతి ఇలా అంటోంది **"ఆయుషః క్షణ ఏకోఽపి సర్వ రత్నైర్న లభ్యతే! నీయతే తద్వృ థాయేన ప్రమాదః సమహానహో"**. "ఆయుష్షు యొక్క ఒక్క క్షణమును తిరిగి తెచ్చుకోలేము. కాబట్టి జీవితమును వ్యర్థముగా గడిపివేయుట మహా ప్రమాదము" జాగరూకుడయిన మానవుడే 'జీవించిన' వాడు. ఇంకొక అడుగు ముందుకేసి నా వంటి మంద బుద్ధులకు నిష్కర్ష అయిన మరొక వాక్యము **"ధనే నష్టే పునః ప్రాప్తుం శక్తి స్స్యాద్య స్య కస్యచిత్। గత కాలస్తు నాయాతి**

**ఏవ మీశ్వర శాసనమ్"** "ఎవడైనా ధనమును పోగొట్టుకొనిన మరల సంపాదించవచ్చును, కాని గడచిన కాలము మాత్రము తిరిగి రాదనుట ఈశ్వర శాసనమైయున్నది". పండు ఒలిచి నోటినుంచినట్లున్న ఈ మాటల కంటే మధురముగా ఏం చెప్పాలి పెద్దలు మనకు. వేదం వాకిట్లో నుంచి సద్గురువునే పెరట్లో కొద్దాం. 'మంద'స్మితుడన్న మధ్య వయస్కుడు, కమలాపురాధీశుని అంతేవాసి (అంతరంగికుడు) రాజునను గ్రహించ వచ్చిన సాధువును రాజుతోపాటు తననూ దీవించమని వేడుకున్నాడు. అనుగ్రహించడం తప్ప మరొకటి తెలియని సాధువు "మందస్మితా, అందుకో ఈ శిలను! ఈ శిలను ఎక్కడెక్కడ తాకిస్తే అక్కడంతా సువర్ణమయం అవుతుంది. అయితే నేను నా సద్గురు దర్శనానికి వెళ్లి వచ్చే ఈ రెండుదినాల్లో నీవు నీ జీవితాన్ని సువర్ణం చేసుకో!" అంటూ శిలను వదిలివెళ్లాడు. ఇంతలో రాజు పిలిచాడు మందస్మితుడ్ని. రాజు పురమాయించిన పనుల నోట – మందస్మితుడు మరిచాడు సాధువు మాట. రెండోరోజు సాయంత్రం సాధువు తన సద్గురు దర్శనం చేసుకొని తన ఇంటికెళ్తూ రాజాశ్రయానికి వచ్చి మందస్మితుడిని అడిగాడు శిల. "అయ్యా! మీరు కరుణా సముద్రులు, దయకు మూర్తి వంటి వారు. మీరిచ్చిన ఈ రెండురోజులను నేను సద్వినియోగం చేసుకోలేకపోయాను. దయచేసి మీరు నాకు మరో రెండురోజులు ఈ శిలను ఇవ్వవలసిందని" వేడుకున్నాడు. సాధువు ఇలా అన్నాడు "మందస్మితా! శిలనొసగిన ఈశ్వరుని మాట శిలాశాసనమ్. ఈ శిల రెండు దినములు ఆవల నీవద్ద నున్నను ఇది కేవలం 'రాయి' మాత్రమే. మనిషి సమయాన్ని సద్వినియోగం చేసుకుంటే 'మృణ్మయ'మైన జీవితం 'చిన్మయ'మవుతుందని మనిద్దరికీ ఇది సద్గురుబోధ". మందస్మితుడు ఆనందస్థితుడయినాడు. దైన్యమును వీడి దైవమును తెలుసుకోవాలన్న ఆకాంక్షకు బద్ధుడయినాడు. 'సువర్ణము'ను వీడి తన నిజ 'వర్ణ'మును తెలుసుకునేందుకు సద్గురువును చూపమని సాధువు వెంట బయలుదేరాడు. మనిషి చేసేది ఇదే! లక్క ఇల్లు కట్టుకుని అగ్నికి ఆహుతయ్యే ప్రమాదముందని తెలిసి – అగ్గి అంటుకున్నాక బావి త్రవ్వుతాడు. ఇవీ కాలమునే కాలుడు (యముడు) చేతిలో పడితే జరిగే పరిణామాలు. మరి సాయి మనకు చెప్పిన మాటల్లో సమయ సద్వినియోగమంటే!



**సద్గురుపథం – సమయం – సద్వినియోగం**

"పని చెయ్యి, సద్గ్రంథాలు చదువు, దేవుని నామం ఉచ్చరించు" మనకు ఎలా తెలుసుకోవాలో, ఎలా పంచుకోవాలో తెలియకే కానీ ఇన్ని మాటలు – సాయివంటి సద్గురు సామ్రాట్ మూడు పదాల్లో – మూణ్ణాళ్ల జీవితాన్ని తెలియచెప్పారు. మనం చేసే ప్రతి పని సద్గురు ప్రసాదమని భావిస్తే సగం చింత తీరినట్లే. ప్రసాదం చేతనంటూ ధరిస్తే భక్తిగానే స్వీకరిస్తామని నమ్మకం. నిత్య జీవితం ఎలా గడవాలో, గడపాలో, ఎవరితో ఎలా వర్తించాలో, ఏది ధర్మ, సత్కర్మాచరణమో, ఏది మానవ జీవిత లక్ష్యమో, ఏది



మార్గమో, ఇలా ప్రతి అడుగును విశ్లేషిస్తూ, విలువలు నేర్పేది సద్గ్రంథం. అందుకే మన పూర్వీకుల జీవితాల్లో సద్గ్రంథ పఠనమనేది నిత్యకృత్యమయ్యింది. విలువలతో సాగిన వారి జీవన విధానం ఈనాడు మనకు మార్గదర్శకమవుతుంది. చివరగా దేవుని నామం ఉచ్ఛరించమన్నారు సాయి. రామ, కృష్ణ, శివ... ఇలా ఎన్నో నామాలు.... **'ఏకం సత్, విప్రా బహుదా వదంతి',** ఒక్కటే అయిన సత్యానికి ఎన్నో నామ రూపాలు. ఏ రూపమయితే మన మనసుకు శాంతినిచ్చిందో, ఆ నామ స్మరణ మనకు ఎదురయ్యే ప్రతి ఇబ్బందిని తొలగిస్తుంది.అందుకే కొన్ని సందర్భాలలో మహాత్ములంటారు నామి (వ్యక్తి) కన్నా నామస్మరణకున్న ప్రాధాన్యత మెండు అని. సాయి మాటలు సదా మనకు స్ఫురణలో ఉండగా.. ఇదిగో యోగానికి సంబంధించిన భాష్యం. **"యుక్తాహారవిహారస్య యుక్తచేష్టస్య కర్మసు। యుక్త స్వప్నావబోధస్య యోగో భవతి దుఃఖహా"** పరిమితమగు ఆహార విహారములు గలవాడును, కర్మలయందు యోగ్యమగు చేష్టలు గలవాడును నగు వ్యక్తికి సంసార క్లేశనాశకమగును" గమనిస్తే మొదటి అంశం శరీరం శక్తివంతంగాను, ఆరోగ్యవంతంగాను ఉంచుటకు కావలసిన శుభ్రత, స్నానము, విహారము, అన్న పానీయములు, వ్యాయామము మొదలగునవి. రెండు సద్గురువు ప్రసాదించిన పని. మూడవది – యోగ్య సమయములో నిద్రించుట. నాల్గవది అత్యంత ప్రధానమైనది – జాగరూకత. ఆరుగంటలు మాత్రమే నిద్రించి, మిగిలిన సమయాన్ని నిశ్చయించుకున్న లక్ష్య సాధనకై దృఢ సంకల్పంతో సాగిపోవడం. ఏ చరణాలను ఆశ్రయిస్తే అంతఃకరణం చింతకు దూరమవుతుందో, అందుకై మనం ఉద్యుక్తులమవడమే మన జీవిత పరమావధి. ఈ లక్ష్యముతో పాటు సదా "ఈ నా కార్యము సిద్ధించును, సద్గురుని కృప నాపై పూర్తిగా ఉన్నదన్న" విశ్వాసము హృదయములో ప్రతిష్టించుకొనవలెను. చివరగా ఒక్కమాట. **"ప్రోద్దీప్తే భవనే తు కూపఖననం ప్రత్యుద్యమః కీ దృశః"** "ఎప్పటి వరకు శరీరము ఆరోగ్యంగా ఉన్నదో, వృద్ధావస్థ దూరంగా ఉన్నదో, ఇంద్రియముల శక్తి నష్టముగాకుండా ఉన్నదో, అప్పటి వరకు వివేకుడైన మానవుడు ఆత్మ కళ్యాణము కొరకు ప్రయత్నించవలెను".

గురుబంధువుల్లారా కళ్లముందు కాలం పరిగెడుతోంది. ఇదిగో నిన్ననే సద్గురు దేవులతో సత్సంగ సంభాషణలు జరిగినట్లుంది. అంతలోనే వారు దేహము నుంచి దివ్యస్వరూపులై మనలను దీవిస్తున్నట్లుంది. పిడకలేరుకుంటున్నామా? పరిణతితో ప్రవర్తిస్తున్నామా! మనల్ని మనం విశ్లేషించుకుందాం. ఉన్న ఈ కాస్త జీవితాన్ని అంతులేని ఆలోచనలతో, అసూయా, ద్వేషాలతో సూటి–పోటి మాటలతో... కల్మషాన్ని నింపుకోకుండా జీవిద్దాం. కాలమనే కాలుడి చేతబడి మనమూ మట్టిలో కలిసిపోక ముందే సద్గురు చరణ సేవనాన్ని, సద్గురు స్మరణాన్ని ఆశ్రయించి సమయాన్ని సద్గురుమయం చేసుకుందాం.

***సద్గురు చరణసేవన ప్రాప్తిరస్తు! శుభం భవతు!!***

# ఆస్తిపరులు



"ఎంత ఆస్తిపరులైతే మాత్రం అంత అహంకారమా? చెప్పండి! ఏమిటో లోకం మారిపోతోందండీ! ఆస్తి ముందు, అంతస్తు ముందు బంధుత్వాలు పనిచేయడం లేదు. స్నేహాలు పనిచేయడం లేదు. తెలివితేటలు, శక్తిసామర్థ్యాలు కూడా పనిచేయడం లేదు. ఏమిటో ఈ లోకంలో చెలామణి కావాలంటే ఆస్తిపరులు కాక తప్పదు అన్నట్లుంది" అంటూ తన జీవితానుభవాన్ని చెప్పసాగిందొకామె.

అంతా విని స్వామి ఇలా అన్నారు – "ఆస్తి'పరులు' అన్న మాటలోనే ఆస్తి పరులదే అన్న హెచ్చరిక ఇమిడి ఉంది. ఉన్నవాడైనా, లేనివాడైనా తినేది ఆ గుప్పెడు మెతుకులే. మిగిలింది బుద్ధిమంతుడైతే తానుండగా ఇస్తాడు. ఆ బుద్ధి లేకపోతే ఆ తరువాత పంచుకుంటారు. ఎవరు? చుట్టూతా ఉండే పరులు. అయితే నీవన్న మాటలో ఒక విధమైన నిజమున్నది. అదేమిటంటే ఇదివరకటి కన్న ఇప్పుడు ప్రజలు ధనానికి విలువ ఇస్తున్నారు. అదే ముఖ్యమన్నట్లు చూస్తున్నారు. అది లేనివారి ముఖం చూడటమంటే చాలా హేళనగా ఉంటోంది వాళ్లకి. అలాగే లేనివాడు కూడ ధనానికే విలువ నిస్తున్నాడు. నా దగ్గర ధనం లేదుకదా! లేదుకదా అని పదిసార్లు అనుకుంటున్నాడు. మరొకలా తనలో ఉన్న శక్తియుక్తులు చూసి అతడు తృప్తిపడటం లేదు, వాటిని సద్వినియోగం చేసే పని కూడా అంతగా చేయడం లేదు. మిగిలినవి ఎన్నుంటే ఏం లాభం? నా దగ్గర ధనం లేదుకదా! ధనం లేదు కాబట్టే లోకం నాకు విలువ నివ్వడం లేదు" అని అనుకుంటూ అతడు కూడా ధనానికే విలువనిస్తున్నాడు. అదీ చిత్రం. ఉన్నవాళ్లు, లేనివాళ్ళు కలిసి ధనానికి వెర్రి విలువనివ్వటమే, ఇప్పటి కాలపు విచిత్రం. ఇది ఇలా ఎంతో కాలం సాగదు. ధనం వెంటపడి పిచ్చి వాడవుతున్న మనిషికి త్వరలోనే నిజంగానే తనకి కావలసిందేమిటి అన్నది తెలుస్తుంది. అతడు వెనక్కి తిరిగి చూస్తాడు. ధనాన్ని ఎంతలో ఉంచాలో అంతలో ఉంచుతాడు. ధనానికి విలువ ఇవ్వడం అనేది మాని దానిని వినియోగించడం ఎలాగో నేర్చుకుంటాడు. కనుక నీవు వర్ణించిన దృశ్యాలు కొద్దికాలంలో మారిపోగలవు. స్వాతంత్ర్యానికి ముందు మనం ధనానికి ఇంత విలువనీయలేదు. ఇకపైన కూడా మనం ఇంత విలువనివ్వం. ఈ మధ్య నడుస్తున్నది ఒక విషమమైన కాలం. ఇది ఇలా ఎంతో కాలం సాగదు. కాలచక్రం తిరగడం ఆగదు. ఆ తిరగడంలో మళ్ళీ మంచి మార్పులు వస్తాయి. ఆమె తృప్తిగా చూసింది. "మీరన్నట్లుగా నా జీవితకాలంలో అలాంటి మంచి దృశ్యాలను చూడాలని కోరకుంటున్నాను". అంటూ స్వామికి నమస్కరించింది. **– స్వామి పలుకులు–స్వాతిచినుకులు**



# మన జీవితధ్యేయం - డిసెంబర్ 2013

**భక్తుడు** : గురువుగారూ! “అస్పష్టంగా ఉన్న సంపూర్ణత్వభావనను అనుభవపూర్వకంగా వాస్తవం చేసుకోవడం” అంటే మీ దృష్టిలో ఏమిటి?



**గురువుగారు :** మీకు ఏం కావాలి అనే విషయంపట్ల మీ అందరికీ అస్పష్టమైన ఒక భావన ఉంటుంది. ప్రేమ, స్వేచ్ఛ, ఆనందం, భగవంతుడు, గురువు, భద్రత... ఇలా దాన్ని ఒక్కొక్కరూ ఒక్కోరకంగా చెప్తారు. ఆనందమంటే ఇదీ అని అందరికీ ఒకే రకమైన అభిప్రాయం ఉండదు, వారి అభిప్రాయాలు ఏవైనా చివరికి అన్నీ ఒక విషయం క్రిందికే వస్తాయి. అదే సంపూర్ణత్వం. అందుచేతనే నేను ‘సంపూర్ణత్వం’ అనే పదాన్ని వాడతాను. చాలామందికి వారి సంపూర్ణత్వ భావన అస్పష్టంగా ఉంటుంది. వాళ్లు దానిని రకరకాల మార్గాలలో అనుభవపూర్వకంగా వాస్తవం చేసుకోవాలనుకుంటారు. ఉదాహరణకు మంచి ఉద్యోగం కోసం, ప్రమోషన్ కోసం, మంచి జీవితభాగస్వామి కోసం, మంచి ఆరోగ్యం కోసం... ఇలా వారు ప్రయత్నిస్తూ ఉంటారు. ఇటువంటి వాటిని పొందడం ద్వారా సంపూర్ణమైన ఆనందాన్ని పొందగలము అనుకుంటారు. ఇలా ప్రతి ఒక్కటీ వారిలో అస్పష్టంగా ఉన్న సంపూర్ణత్వ భావనను అనుభవపూర్వకంగా వాస్తవం చేసుకోవడానికి ఒక మార్గమే. కానీ వారు ఇలా ప్రయత్నం చేసేకొద్దీ, చేసేకొద్దీ వారు బాబా వంటి సద్గురువును ఆనందం పొందలేమని, వీటన్నింటికీ మించినది మరేదో ఉంది అని తెలుసుకుంటారు. అప్పుడు వారు బాబా వంటి సద్గురువును కలుసుకున్నపుడు, ఆయనవద్ద తమకు అప్పటిదాకా తెలిసిన పద్ధతులలో (మార్గాలలో) కాకుండా తమలోని ఆ సంపూర్ణత్వ భావనను వారు స్పష్టంగా అనుభూతి చెందగలుగుతారు. మీ బాధ్యత ఆయన వహించి ఉన్నాడన్న నిశ్చింతను, భద్రతాభావాన్ని పొందుతారు. అంతకుముందు బ్యాంకులో లక్షరూపాయలు ఉంటే మీకు భద్రతగా అనిపించేది. అయితే ఇప్పుడు, మీకు బ్యాంక్ అకౌంట్ లేదు, డబ్బులు లేవు, మీరిక్కడ భద్రతాభావాన్ని, భరోసాను పొందుతారు అనేటటువంటి స్పష్టమైన హామీ కూడా లేదు. కానీ కేవలం సద్గురు దర్శనం మాత్రం చేతనే మీ బాధ్యత ఆయన తీసుకుంటారని మీ అంతరాళాలలో ఏదో మీకు చెబుతుంది. మాటల్లో వర్ణించలేని, అనిర్వచనీయమైన శాంతి, ఆనందం, భద్రతాభావం వంటివి మనసుకు అనుభవమవుతాయి. ఆ అనుభవం వల్ల మనస్సు సద్గురువు పట్ల ఆకర్షింపబడి ముగ్ధమవుతుంది.

**గురువుగారు :** మొదట మనం ప్రాపంచికమైన విషయాలలో మనం ఆనందం దాగి వుందని బావిస్తాం.



అంటే ఉద్యోగం, డబ్బు, మంచిస్థాయి, విజయం (సక్సెస్)... ఇటువంటివన్నీ! ఆనందానికి ఇవన్నీ మూలం కాదని నేను చెప్పినప్పటికీ అది వారి చెవికెక్కదు. అందుకని బాబా వారికి మొదట ప్రాపంచికమైన కోరికలు తీర్చాలి. కాబట్టి బాబా ముందు వాటిని తీరుస్తారు. మన ప్రాపంచికమైన కోరికలు, అవసరాలు తీరి మనం అనుకునే విజయాన్ని, ఆనందాన్ని పొందినప్పటికీ కూడా మనలో ఇంకా అసంతృప్తి ఉంటుంది. ఇంకా ఏదో కొరత ఉంటుంది. కానీ అదేమిటో మనకు తెలియదు. మన మనస్సుకు అది అందదు, మనం దాన్ని 'ఫలానా' అని చెప్పలేము. అప్పుడు అదేమిటి అని ఆలోచించడం మొదలుపెడతారు. ఇంతలో ఎవరో వారికి వేదాంతం గురించి చెప్తారు. దాంతో వారు ఆ ఆధ్యాత్మిక గ్రంథాలు మొదలైనవన్నీ చదువుతారు. "నేను ఆత్మను, నాకు సాక్షాత్కారం కావాలి, నాకు నిర్వాణం కావాలి!" ఇలాంటి సిద్ధంగా ఉన్న సమాధానాలు వాటిల్లో దొరుకుతాయి. కానీ వారు కోరుకున్న సంతృప్తి, ఆనందం లభించకపోగా వారు మరింత గందరగోళానికి లోనవుతారు. (గురువుగారు నవ్వుతూ...) వారు 'నిర్వాణం'గా అనుకునే దానికి అసలైన అర్థమేమిటో వారికి తెలియదు. అది వారికి అనుభవమవుతున్న కొరతను అస్పష్టంగా సూచించే భావనకు ఒక పదం మాత్రమే. వారికి నిజంగా కావల్సిందేమిటి అనే దానికి ఒక అస్పష్టమైన భావాన్ని మాత్రమే అది సూచిస్తుంది. అది కేవలం సిద్ధాంతమాత్రంగానే ఉండటం వల్ల అది చాలా చాలా అస్పష్టంగా ఉండి పోతుంది. ఆ తరువాత, మీరు సాయిబాబా వంటి సద్గురువును కలుసుకున్నప్పుడు, ఏ కారణమూ లేకుండా, కేవలం ఆయనను చూడటం ద్వారా, కేవలం ఆయన సన్నిధిలో ఉండటం ద్వారా మీరు ఒక అనిర్వచనీయమైన దాన్ని అనుభూతి చెందుతారు. మీరు దానిని వర్ణించలేరు. ప్రాపంచికమైన ఏ అంశం మీదా ఆధారపడని ఒక రకమైన సంతృప్తస్థితి, ఆనందం అనుభవమవుతుంది. ఉదాహరణకు, ఇప్పుడిక్కడ మీరంతా కూర్చుని ఉన్నారు. ఏం అనుకూలంగా ఉంది మీకిక్కడ? అర్ధరాత్రి, సమయం 12 గంటలు, చలిగాలి వీస్తోంది, మీలో చాలామంది ఉదయాన్నే గిరిప్రదక్షిణకు వెళ్లారు, రోజంతా ఏదో పనిలో తీరిక లేకుండా ఉన్నారు. నిజానికి ఇప్పుడు ఇలా కూర్చోవడమనేది చిత్రహింసే. (గురువుగారు నవ్వుతూ...) కానీ మీ ముఖాలలో అలాంటి ఛాయలేవీ కనిపించడం లేదు.

అలాంటి సంతృప్తి, మన ఆనందానికి మూలం అని మనం అనుకుంటున్న ఏ విషయం మీదా ఆధారపడి లేదు. మన హృదయంలో ఏదో స్పందన కలిగి మనకు ఆనందం అనుభవమవుతుంది. మనం కోరుకునేది మనమిక్కడ పొందుతున్నాము అనిపిస్తుంది. "బాబా చూసుకుంటారు, మన కోసం ఆయన ఉన్నారు" అనే భద్రతాభావం కలుగుతుంది. చాలా సందర్భాలలో మనం ఆనందాన్ని కోల్పోవడానికి మనలోని భయాలు, అభద్రతాభావం కారణమవుతాయి. కొన్నింటికి కారణాలు ఉంటాయి, కొన్నింటికి కారణాలు ఉండవు. కారణాలు ఉన్నా, లేకున్నా వాటి వలన మన ఆనందానికి భంగం కలుగుతోంది. సద్గురు సన్నిధిలో



మనకు అటువంటి అభద్రతాభావం కలుగదు. ఆయన సన్నిధిలో మనకు ప్రప్రథమంగా అనుభవమయ్యేది ఇదే. "బాబా ఉన్నారు, ఆయన చూసుకుంటారు, నాకు ఏం కావాలో ఆయనకు తెలుసు!" అనే భద్రతాభావం కలుగుతుంది. బాబా నుండి ఆ రక్షణను మనం ఇంకా పొందకపోవచ్చు, కానీ మనకు మాటలకందని ఆ అనుభూతి కలుగుతుంది. ఎక్కడైతే అటువంటి సంతోషాన్ని, భద్రతను అనుభూతి చెందుతామో అదే గురుస్వరూపం, మన సద్గురుస్వరూపం. నిజానికి సద్గురువు అంటే ఏమిటి? మన అంతరంగంలోని అస్పష్టమైన సంపూర్ణత్వానికి, ఆనందానికి స్థూలరూపమే ఆయన.

'సంపూర్ణత్వం' అనేది మీకు ఒక అస్పష్టమైన భావనగా ఉంది, అదేమిటో మీకు ఇంకా ఖచ్చితంగా తెలియదు, కానీ మీరు దానిని కాస్త రుచి చూసారు. ఒక్కసారి దానిని రుచి చూసిన తరువాత మీరు ఇంకా ఇంకా కావాలనుకొంటారు. ఇలా రుచి చూడటం వల్ల మీరు దానిని ఇంకా ఇంకా తెలుసుకోగలుగుతారు, అనుభూతి చెందగలుగుతారు. మీరు పొందుతున్నది, మీరు అనుభూతి చెందుతున్నది, మీరు ప్రత్యక్షంగా తెలుసుకుంటున్నదీ – మీ పరిపూర్ణత్వాన్నే (fulfilment), మీ ఆనందాన్నే! ఇందులో ఎటువంటి భయంగాని, కొరతగానీ ఉండదు, మరి దేనికోసమూ కొరత అనేదే ఉండదు, అక్కడ మనకు అవసరమైనదంతా ఉంది, అంతకుమించీ ఉంది.

**భక్తుడు :** మేము జన్మించడానికి కారణమంటూ ఉందా?

**గురువుగారు :** కారణం ఉంది. కాని అదేమిటో మీకు స్పష్టంగా తెలియదు, అది చాలా అస్పష్టంగా ఉంటుంది. నేను దానినే "అస్పష్టమైన సంపూర్ణత్వ భావన" (abstract sense of fulfilment) అని అంటాను. లేదా మీకు అది అస్పష్టమైన ధ్యేయం కావచ్చు. ఇబ్బందేం లేదు, లేదా కొంతమంది దానిని అస్పష్టంగా ఉన్న జీవిత పరమార్థం అనవచ్చు.

**భక్తుడు :** అలా అయితే, మన జీవితధ్యేయం సంపూర్ణత్వం పొందడమేనా?

**గురువుగారు :** నేను అలానే అనుకుంటున్నాను. ఇంకెవరన్నా అది మరేదోనని అనుకొన్నా, వారు దానిని మరోరకంగా వ్యక్తం చేయాలనుకొన్నా సమస్యేం లేదు. నా వరకు నాకు "సంపూర్ణత్వం" (fulfilment) అనే మాట సాధారణంగా అందరికీ ఉండే భావనను వ్యక్తం చేస్తుంది. ఉదాహరణకు ఎవరైనా వేరే భాషను నేర్చుకోవాలనో, మరేదో విషయం పట్ల తమ పరిజ్ఞానాన్ని పెంచుకోవాలనో లేదా తమ ఆత్మను తెలుసుకోవాలనో అనుకొన్నా రనుకోండి. వాళ్ళు దానిని తమ జీవితధ్యేయంగా చెప్పుకొంటారు. దాన్ని సాధిస్తే వాళ్ళు సంపూర్ణత్వాన్ని పొందుతారు. అది జ్ఞానమైనా లేదా ఆధ్యాత్మికానుభవమైనా, ధనమైనా, అదేదైనా కానివ్వండి, ఆ అంతిమ ఫలితం సంపూర్ణత్వం. అక్కడ వాళ్ళు మార్గాల గురించి మాట్లాడుతున్నారు. నేను చరమలక్ష్యం గురించి మాట్లాడుతున్నాను. అందుకనే నేను దానిని "సంపూర్ణత్వం" అంటాను. ఇంకెవరైనా



దాన్ని మరో పేరుతో పిలుస్తామంటే నాకేమీ అభ్యంతరం లేదు. ఎందుకంటే అది కేవలం పదజాలం మాత్రమే. నేను ఎప్పుడూ అవే పదాలకు పరిమితమై ఉండనని మీకు తెలుసు కదా (గురువుగారు నవ్వుతూ...) ఎందుకని? ఎందుకంటే అది కేవలం పదజాలమే కాబట్టి.

**గురువుగారు :** 'మేము పరిపూర్ణులం' అని మీలో మీరు అనుకోవచ్చు, కాని మీరు వాస్తవంగా దానిని అనుభూతి చెందడం లేదు. ఉదాహరణకు, మీ బ్యాంకు ఖాతాలో ఎవరో ఒక లక్ష రూపాయలు వేసారని మీకు తెలిసింది. కానీ మీ దగ్గర చెక్‌బుక్ లేదు, ఆ డబ్బులు ఎలా తీసుకోవాలో మీకు తెలియదు. మీ దృష్టిలో మీరు ధనవంతులా లేక పేదవారా? మీరు ధనవంతులే కానీ దాన్ని స్పష్టం చేసుకోవడానికి (ఆ డబ్బును తీసుకోవడానికి) మీకు చెక్‌బుక్ అవసరం. మీ అకౌంట్‌లో లక్ష రూపాయలు ఉన్నాయి అనే నిజం మీకు అస్పష్టమైన విషయం. దాన్ని అనుభవపూర్వకంగా పొందాలి అంటే మీరు ఆ డబ్బును డ్రా చేసుకోవాలి. ఇలా డ్రా చేసుకునే ప్రక్రియనే 'వాస్తవం చేసుకోవడం' (concretization) అంటారు. "ఆనందం మీలోనే ఉంది, మీరు ఆనందస్వరూపులు!" అని కొంతమంది అనవచ్చు. సరే, బాగానే ఉంది, నేను చెప్పేది కూడా అదే, అది మీలో అస్పష్టంగా, అవ్యక్తంగా ఉన్న ఆనందం. సమస్యంతా ఏమిటంటే అది అస్పష్టంగా, అవ్యక్తంగా ఉంది. జీవితమంతా కూడా అస్పష్టంగా, అవ్యక్తంగా ఉన్న ఆ ఆనందాన్ని అనుభవంలోనికి తెచ్చుకోవడానికి చేసే ప్రయత్నమే. మీరేదీ వెలుపల నుండి పొందడం లేదు అనేది నిజమే. అదేదో మీలోనే ఉంది కానీ అదేమిటో మీకు తెలియదు. దాని స్వరూప స్వభావాలేమిటో మీకు తెలియదు. కాబట్టి మీరు దానిని ఆస్వాదించలేకపోతున్నారు. అది మీలోనే ఉన్నప్పటికీ కూడా మీరు దానిని ఆస్వాదించలేకపోతున్నారనే విషయం మీకు మరింత బాధను కలిగిస్తుంది. పరిస్థితి మరింత దారుణంగా తయారవుతుంది.

కాబట్టి మనం – 'అస్పష్టంగా ఉన్న ఆనందాన్ని స్పష్టంగా అనుభవంలోకి తెచ్చుకోవడం' అనే ప్రక్రియను అర్థం చేసుకొంటే – మీపట్ల, మీ జీవితం పట్ల, ప్రాపంచిక జీవితం, ఆధ్యాత్మిక జీవితం అని అనుకొనే వాటిపట్ల మీ దృక్పథం ఎలా ఉంది? సద్గురువు యొక్క అవసరం ఏమిటి? సద్గురుపథంలో ఏం జరుగుతుంది?... ఇలాంటి అన్ని ప్రశ్నలకూ సమాధానాలు లభిస్తాయి. అప్పుడు ప్రతి ఒక్కటీ స్పష్టమవుతుంది. అప్పుడు మీరేం చేసినా అర్థవంతంగా ఉంటుంది. "నేను సరైన మార్గంలో పోతున్నానా? నేను చేసే ఈ పనులన్నీ నాలో అస్పష్టంగా ఉన్న ఆ ఆనందాన్ని వాస్తవం చేసుకోవడానికి నిజంగా దోహదం చేస్తున్నాయా?" అని కనీసం మిమ్మల్ని మీరు ప్రశ్నించుకోవచ్చు, తరచి చూసుకోవచ్చు.

**భక్తుడు** : గురువుగారూ, మా అందరికీ ఆనందం పట్ల ఎవరి స్వంత అభిప్రాయం వారికి ఉంటుందా?

**గురువుగారు :** అవును, దానినే నేను మీలోని "అస్పష్టమైన సంపూర్ణత్వ భావన" అంటాను. మనం చేసే



ప్రతి పని కూడా ఎల్లప్పుడూ ఆ అస్పష్టమైన సంపూర్ణత్వ భావనతో ముడిపడినదై ఉంటుంది. మనం దానిని స్పష్టంగా అనుభూతి చెందడానికి ప్రయత్నిస్తున్నాం – ప్రతి ఒక్కరూ ప్రయత్నిస్తున్నారు. డబ్బు, రాజకీయాలు, సంబంధ బాంధవ్యాలు, ఇళ్ళు, ఆస్తులు, వ్యాపారం... ఇలా ప్రతి ఒక్కరూ ఎవరి మార్గంలో వారు ప్రయత్నిస్తున్నారు. ఇవన్నీ ఏమిటి? మనలో అస్పష్టంగా ఉన్న ఆనందభావనను స్పష్టంగా అనుభూతి చెందడానికి మనం స్వంతంగా ప్రయత్నం చేసేటటువంటి మార్గాలు. ఇది (సాయిపథం) కూడా ఒక మార్గం. ఇక్కడ ఈ ఆనందాన్ని – అది పూర్తిగా కాకపోయినప్పటికీ – కాస్త అనుభూతి చెందినా, రవంత మాత్రంగానైనా పొందినా, "ఇది చాలా బావుంది, చాలా అద్భుతంగా ఉంది, దీనిని ఇంకా ఇంకా అనుభవంలోనికి తెచ్చుకోవాలి" అనిపిస్తుంది. కానీ మనకు ఇతర వ్యామోహాలు, భావనలు ఉంటాయి. ఆ వాసనలు (patterns) మనల్ని అంత సులువుగా విడిచిపెట్టవు. ఆనందాన్ని పొందడానికి మనం చేసే ప్రయత్నాలకు అవి పరిమితులు సృష్టిస్తుంటాయి.

బాబా యొక్క ఖజానాలో మన నిజమైన ఆనందం ఉందని మనం సిద్ధాంతరీత్యా ఒప్పుకొంటాం, కానీ అది కేవలం అంతవరకే, నిజంగా మనం దానిని మనఃపూర్వకంగా అంగీకరించం, మనం ఏమనుకొంటామంటే, "మన ఆనందం ఆయన ఖజానాలో ఉందని బాబా చెప్పారు, కానీ నేను అలా అనుకోవడం లేదు. మాకు ఆనందాన్నిచ్చే కొన్ని వేరే విషయాలు కూడా ఉన్నాయి. కాబట్టి బాబా దగ్గర ఉన్న ఆనందాన్ని పొందడానికి ప్రయత్నిస్తూనే, ఈ ప్రపంచం నుండి కూడా మనం పొందగలిగినంత ఆనందాన్ని పొందుదాము. మన జీవితం సమతౌల్యం (balance)గా ఉండాలి : "బాబా పట్ల భక్తి మంచిదే, ప్రాపంచిక విషయాలు మంచివే, సంబంధ బాంధవ్యాలు, వ్యాపారం, డబ్బు, ఇవన్నీ మంచివే"... అని అనుకొంటాం. మన ఆలోచనలు ఇలా ఉంటాయి, ప్రతిదీ మనకు అయిదు, పదిశాతం ఆనందాన్ని ఇస్తుంది. ఇవన్నీ కలిపి మనకు అరవైశాతం ఆనందాన్ని ఇస్తాయి (గురువుగారు నవ్వుతూ...) మంచిదే! మనిషి జీవితం ఇలానే సాగిపోతుంది.

**భక్తుడు** : అలా అయితే మిగిలిన నలభై శాతం సంగతేంటి? అదెక్కడుంటుంది, గురువుగారూ?

**గురువుగారు :** అది మనకు తెలియనది – మనం దానిని పొందలేము. ఆ మిగిలిన నలభైశాతమే మనకు సంపూర్ణమైన ఆనందం, నూరుశాతం ఆనందం ఎలా పొందాలనే ప్రేరణనిచ్చి మనల్ని మనం ప్రశ్నించుకునేలా చేస్తుంది. మనం ఒక సద్గురువును చేరుకున్నపుడు, మనకు అప్పటిదాకా తెలిసిన వాటిమీద ఆధారపడకుండా నూటికి నూరుశాతం ఆనందం పొందవచ్చు అనేది మనకు అక్కడ అణుమాత్రంగానైనా తెలుస్తుంది. ఆనందాన్ని పొందడానికి గల ఇతర మార్గాలన్నింటిలో వాటి (మార్గాల) మీద ఆధారపడటం అంతర్లీనంగా ఉంటుంది. కాని సద్గురువు విషయంలో (సాధనల మీద) ఆధారపడటం అనేది తక్కువగా ఉంటుంది. ఏ కారణమూ లేకుండానే, మనం ఏమీ చేయకుండానే, ఎటువంటి సాధనలు లేకుండానే మన మనస్సు



ఆనందంగా, సంతోషంగా, నిశ్చింతగా, సంతృప్తిగా ఉంటుంది. సంపూర్ణమైన సంతృప్తి మన అంతరంగంలో నుండి వస్తుంది. అది ఎక్కడినుండి వస్తుంది? ఇది మనకు సరిగా తెలియని విషయం. మనం అక్కడి నుండి మొదలుపెడతాం, అక్కడ మనకు నూరుశాతం ఆనందం పొందడానికి ఒక అవకాశం ఉంటుంది. మిగతా మార్గాలలో మనం నూరుశాతం ఆనందాన్ని పొందలేకపోవడానికి గల కారణం ఏమిటంటే, మనకున్న వివిధ రకాల కోరికలు (pulls) ఒకదానికొకటి వ్యతిరిక్తంగా పనిచేసి ఆనందాన్ని పొందనీయకుండా చేస్తాయి. ఉదాహరణకు, ఒకరు వ్యాపారం చేయాలనుకొంటారు. దానితోపాటు అతనికి కుటుంబం, సంబంధబాంధవ్యాలు... ఇవన్నీ కూడా కావాలి. అతనికి బాగా సంపాదించాలని ఉంటుంది. దానికి అతని భార్య “ఎప్పుడూ వ్యాపారం అంటూ బయట తిరడగమేనా? ఇంటి దగ్గర ఎక్కువ సమయం గడపండి!” అని అభ్యంతరపెడుతుంది. దాంతో అక్కడ సంఘర్షణ చోటు చేసుకుంటుంది. అతను దానిని ఎలా సంతులనం(balance) చేసుకోవాలి? అతను కుటుంబంతోనే ఉంటే అతనికి వందశాతం ఆనందం కలగదు. ఎందుకంటే అతను ఇంటి దగ్గర ఉంటే వ్యాపారంలో డబ్బులు సంపాదించలేడు. అతనికి డబ్బు సంపాదనే ప్రధానమైతే కుటుంబజీవితాన్ని కోల్పోతాడు. అప్పుడు ఏం చేయాలి? అతను రెండింటి మధ్య సమతుల్యత సాధించడానికి ప్రయత్నిస్తాడు. సమతుల్యత సాధించడమంటే రాజీపడటం – అంటే నలభైశాతం ఇక్కడ, అరవైశాతం అక్కడ లేదా అరవైశాతం ఇక్కడ, నలభైశాతం అక్కడ – ఇలాశాతాల లెక్కలు వస్తాయి. ఈ విధంగా మనలో వందలకొద్దీ కోరికలు (pulls) ఉంటాయి. నేను కేవలం కొన్ని ఉదాహరణలు మాత్రమే ఇస్తున్నాను. మనకు మానసికమైన, శారీరకమైన ఎన్నో కోరికలు (pulls) ఉంటాయి. అవి మనల్ని పరస్పర వ్యతిరేకమైన దిశల్లో లాగుతుంటాయి. చివరికి మనం, ఇతరత్రా దేనిమీదో ఆధారపడకుండా, మనకు నూటికి నూరు శాతం ఆనందాన్ని అందించే ఒకే ఒక్క ఆకర్షణను (pull) కనుగొంటాము. ఇక అక్కడి నుండి మనం మొదలుపెడతాం.

**భక్తుడు** : ఎక్కడి నుండి మొదలుపెడతాము?

**గురువుగారు :** సద్గురువుతో మొదలుపెడతాము. బాబా కూడా దీన్ని స్వయంగా అనుభూతి చెందారు. అందుకే ఆయన, తన ఖజానా నూటికి నూరుశాతం ఆనందాన్ని ఇవ్వగలదు అని చెప్పారు. కానీ అది మనకు తెలియదు. “అవునా, నిజామా?” అని అడుగుతాం, తరువాత గౌరవం కొద్దీ, “సరే, ఒప్పుకుంటున్నాను. బాబా చెప్పారు కాబట్టి అది నిజమే కావచ్చు” అని అంటాము. కానీ నిజంగా మనం దానిని అంగీకరించము.

**గురువుగారు :** సాధారణంగా జరిగేదేమిటంటే మనకేదైనా కోరికున్నపుడు – అది ఇల్లు కావచ్చు, పిల్లలు కావచ్చు లేదా మరేదైనా కావచ్చు – మనం కోరుకునేది ఆ విషయాన్నో, వస్తువునో కాదు. ఆ విషయం లేదా వస్తువు ద్వారా వచ్చే ఆనందాన్నే మనం కోరుకుంటాం – ఆ ఆనందమే మనలో అస్పష్టంగా ఉండే

భావన. మనం దానిని పట్టుకోవడానికి చేసే ప్రయత్నంలో మనం ఆ ఆనందభావనకు నిర్ధిష్టరూపాన్ని ఇవ్వడానికి ప్రయత్నిస్తున్నాం. మీరు దానినే ఆధ్యాత్మిక విషయాలకు వర్తింపచేస్తే అది మరింత సూక్ష్మంగా, సంక్లిష్టంగా తయారవుతుంది.



ఉదాహరణకు, "నాకు ఒక కప్పు కాఫీ కావాలి" అనే దానితో మొదలుపెట్టండి. కాఫీ త్రాగాలనుకొన్నప్పుడు జరిగేది ఏమిటంటే మనలో ఒక అస్పష్టమైన సంతృప్తభావనేదో కాఫీ త్రాగడం ద్వారా నెరవేరుతుంది. కాబట్టి కాఫీ అనేది ఆ అస్పష్ట భావనను మేల్కొలిపి దానిని మరింత నిర్ధిష్టంగా మనకు తెలిసేలా చేస్తుంది. కానీ కాఫీ విషయంలో మనలోని సంతృప్తి అనే అనుభవం కేవలం ఉ పరితలాన మాత్రమే ఉంటుంది. కానీ ఆ కోరిక మూలంలో మరింత తీవ్రమైన వెలితి, అసంతృప్తి, నిస్పృహ మొదలైన భావనలు ఉంటాయి. ఇటువంటి విషయాల (మన కోరికల) మూలంలో లేనటువంటి ఆనందాన్ని కనుగొనడానికి కొందరు ఆధ్యాత్మిక మార్గాన్ని ఆశ్రయిస్తారు. ఉదాహరణకు, ఆ స్థాయిలో, అవ్యాజమైన ప్రేమను పొందడమే మీ అవసరం అయినపుడు, మీకు ఆ అనుభవాన్ని ఇవ్వగలిగిన రూపం కోసం అన్వేషిస్తారు. ఎందుకంటే ప్రేమను అనుభూతి చెంది, దానిని వ్యక్తం చేయాల్సిన అవసరం మనకు ఉన్నా కూడా, మనలో ఆ ప్రేమను కలిగించడానికి, ఆ ప్రేమను వెలికితీయడానికి మనకు ఒక రూపం (సద్గురువు) అవసరం. అటువంటి రూపం కోసం మనం అక్కడా ఇక్కడా వెతుకుతాం, అప్రయత్నంగా మనలో ప్రేమ వాహినిని జనింపచేసే ఆ రూపాన్ని కనుగొన్నపుడు ఆ రూపం పట్ల మనప్రేమను వ్యక్తం చేస్తాం. అదే దానిని వాస్తవం చేసుకోవడమంటే: ఆ విషయం, వ్యక్తి, రూపం లేదా మీరు దానిని ఎలా పిలిచినా సరే అదే మీలోని అసంపూర్ణమైన ప్రేమను సంపూర్ణంగా అనుభూతి చెందడం, అస్పష్టమైన సంపూర్ణత్వ భావనను వాస్తవం చేసుకోవడం.

**గురువుగారు :** "నా భక్తులు అడిగినవన్నీ ఇస్తూనే ఉంటాను, నేను ఇవ్వదలచింది వారడిగేంతవరకు" అన్నారు శ్రీసాయిబాబా. ఆయన ఏం ఇవ్వాలనుకొంటున్నారో ఆయన ఏనాడూ చెప్పలేదు. ఆయన దగ్గరకు భక్తులు రకరకాల కోరికలతో వచ్చేవారు. వాటిలో ఇది గొప్పది, అది తక్కువది, ఇది ఉన్నతమైనది, అది అల్పమైనది అన్న వ్యత్యాసం ఏమీ లేదు. ప్రతి ఒక్కరూ వారి వారి స్థాయిల్లో ఉన్నారు. మొదట బాబా వారి స్థాయికి వచ్చి వాటిని నెరవేర్చాలి. అటుపై ఆయన వారిని చేయిపట్టుకొని నడిపించి ఆయన స్థాయికి తీసుకెళతారు. ఆయన కొండపైన కూర్చుని, "మీరు పైకి రండి, వస్తే నేను మీకు ఈ కొండంతా చూపిస్తాను" అని చెప్పరు. అలాకాదు, బాబా మన కోసం క్రిందికి దిగివస్తారు. ఉదాహరణకు, మీ అమ్మాయికి స్కూలుకు వెళ్లాలని ఉండదు, "నేను స్కూలుకు వెళ్లను" అంటుంది. ఆమె బాగా చదువుకోవాలని ఆశిస్తారు కాబట్టి, "తప్పకుండా వెళ్లాల్సిందే" అంటారు మీరు. దానికి పాప, "నాకు చాక్లెట్లు కావాలి" అంటుంది. మీరు ఆ అమ్మాయికి చాక్లెట్లు ఇస్తారు. "నువ్వు స్కూలుకు వెళితే ఇంకా చాక్లెట్లు ఇస్తాను" అని చెబుతారు. తను



చాక్లెట్లు తీసుకొని స్కూలుకు వెళుతుంది. ఆమెను స్కూలుకు పంపించడానికే మీరు చాక్లెట్లు ఇస్తున్నారు. ఆ పసిపిల్లలాగే, మనకూ చాలా కావాలి. మంచి ఉద్యోగం, ప్రమోషన్, విజయం సాధించడం ఇలా – ఇవన్నీ చాక్లెట్ల వంటివే. అమ్మలాగా బాబా మనకు వాటిని ఇస్తారు. వాటిని ఇవ్వడం మాత్రమే ఆయన ఉద్దేశ్యం కాకపోవచ్చు. అంతకంటే ఉన్నతమైనది ఉన్నదని ఆయనకు తెలిసి ఉండవచ్చు. కానీ మనం దానిని తీసుకోవడానికి సిద్ధంగా లేము. మన స్థాయిలో మనకు ఇవి కావాలి, చిన్న పిల్లకు ఆడుకోవడానికి బొమ్మలు కావాలి. బొమ్మలతో ఆడుకోవడం భ్రమని, అర్థంలేనివని మనకు తెలుసు. ఆడుకోవడం ఆ పాప పసితనాన్ని తెలియచేస్తుంది. కానీ మనం ఆ పాపతో "బొమ్మలు నిజం కాదు, వాటితో ఆడుకోవడం ఎందుకు, నువ్వు ఎదగాలి, వాటితో ఆడుకోవడం ఆపు" అని అంటామా? లేదు, మనం ఇంకా ఎక్కువ బొమ్మలు కొనిస్తాం, అది మన ప్రేమకు చిహ్నం. ఆ అమ్మాయి సరైన వయస్సుకు వచ్చేటప్పటికి తనంతట తానే బొమ్మలతో ఆడుకోవడం మానివేస్తుంది. వేరే వాటికోసం అడుగుతుంది. కానీ ఇప్పుడు మాత్రం, ఆ పాపకు బొమ్మలతో ఆడుకోవడమంటే తనలోని ఆనందభావనను స్పష్టంగా అనుభూతి చెందడం. చివరకు ఆ పాపకు ఆనందాన్నిచ్చేది బొమ్మలు కానప్పటికీ మీరు ఆమెకు బొమ్మలు ఇవ్వాల్సి వస్తుంది.

ఇలా అందరి అవసరాలను, కోరికలను నెరవేర్చి, వారిని సమాధానపరచి, ఎవరి స్థాయిలో వారికి ఆనందాన్ని ఇవ్వగలిగినవారే సద్గురువు.

## ఉద్వేగ పడవద్దు - ఉద్వేగ పరచవద్దు

**యస్మాన్నో ద్విజతే లోకో లోకాన్నో ద్విజతే చయః।**
**హర్షామర్ష భయోద్వేగైః ర్ముక్తోయస్సచమే ప్రియః॥**

ఎదుటివారిని ఇబ్బంది పెట్టకు. ఎదుటివారి వలన ఇబ్బంది పడకు. సంతోషము, రోషము, భయము వలన ఉద్వేగము చెందని జీవితాన్ని గడుపు. శిక్షణలేని మనస్సు పరిపరివిధాల పరిగెత్తుతూ ఉంటుంది. ఇంద్రియాలనూ పరిగెత్తిస్తూ ఉంటుంది. ఊరికే ఉద్వేగానికి గురి అవుతుంది. శిక్షణ పొందుతున్న కొద్దీ హడావుడి తగ్గుతుంది. జీవితకార్యం నిర్వహింపబడుతుంది. ఒక్కటి గమనించండి. హడావిడి తగ్గేవరకూ మనం జీవిత కార్యాన్ని సక్రమంగా నిర్వహించలేము. కాని చాలామందికి హడావుడి పడకుండా పనులెలా జరుగుతాయి అనిపిస్తుంది. ఇంకా శిక్షణ పొందని మనస్సు యొక్క ప్రవచనమిది. దానిని విశ్వసించి బోల్తా పడకండి.



ఒక్కమాట చెప్పనా! ఒకరివలన ఉద్వేగానికి గురికాకుండా, మరొకరిని మనవలన ఉద్వేగపడేటట్లు చేయకుండా, జీవించాగలిగామనుకోండి, అంతకంటే గొప్పతనమేముంటుంది. ఆలోచించండి! కానీ ఏమిటో ఇబ్బంది పడుతున్నాం. ఇబ్బంది పెడుతున్నాం. మనం ఇబ్బంది పెడుతున్నామని వారంటున్నారు. వారు ఇబ్బంది పడుతున్నారని మనమంటున్నాం. ఈ ఇబ్బందుల వైనాలను గూర్చి చుట్టూ ఉన్న సిబ్బందికి చెప్పుకొంటూ అప్పుడప్పుడూ పమిటె చెంగులకు, జేబురుమాళ్లకు పని చెబుతూ జీవితాన్ని గడిపేస్తున్నాము. ఎవరికివారు ఎదుటివారిని ఇబ్బందిపెట్టేవారుగా చూస్తున్నారు. ఇలాంటి ఇబ్బందులు పగవారికి కూడా వద్దు అంటూ తెగవేసి చెబుతున్నాము. ఇలాంటి సమయంలో కృష్ణుడంటాడుకదా, "ఇబ్బంది పెట్టకుండా ఉండటమూ నీచేతిలోనే ఉంది. ఇబ్బంది పడకుండా ఉండటమూ నీ చేతిలోనే ఉంది. కాస్త గమనించు" అని.

ఈమాట మాత్రం విచిత్రంగా ఉంటుంది. ఇది సాధ్యమా అనిపిస్తుంది. పెద్దల అడుగుజాడలలో మనస్సుకూ, ఇంద్రియాలకూ శిక్షణ నీయగలిగితే సాధ్యమే! ఇది తెలియాలి! ఒక మాట చెబుతాను. ఒక పూవు ఉంది. ఉన్నంతసేపూ సృష్టికి శోభను కలిగిస్తుంది. ఒక చెట్టుఉంది. ఉన్నంతసేపూ సృష్టికి నిండుతనాన్ని కలిగిస్తుంది. చెట్టు పైన చిలుక ఉంది. అది సృష్టినే మురిపింపచేస్తుంది. నది ఉంది. ఆహ్లాద పరుస్తుంది. సముద్రముంది. అది ఆశ్చర్యానందాలను అందిస్తుంది. మరి మనం? మనమీ సృష్టికి ఏమందించి వెళుతున్నాం? ఇది ఆలోచించుకోవలసిన అంశం కాదా? 'జంతూనాం నరజన్మ దుర్లభం' అన్నారు కదా! మరి అలాంటి నరజన్మతో కనీసం ఒక పువ్వులా, ఒక చెట్టులా, ఒక చిలుకలా, ఒక నదిలా కూడా మనం ఈ సృష్టిని అలరింపచేయకపోతే, అలరింపచేయలేకపోతే అది ఎంతటి దీనస్థితి! ఎంతటి ఘోరస్థితి! మానవుడు సృష్టికీయవలసిన బదులు ఇదేనా? ఆలోచించండి! వాటి అన్నిటికన్నా తక్కువగా వాటిపాటి ప్రశాంతతను కూడా మనం అనుభవించలేనప్పుడు ఈ నరజన్మకు అర్థమేమిటి? పరమార్థమేమిటి?

ఖనిజాల నుండి చెట్లు వస్తున్నాయి. అటుపైన జంతువులు, అటుపైన మానవులు. అంటే ఏమిటి? ఖనిజాలు, చెట్లు, జంతువులు వీటన్నింటికీ మానవుడు అగ్రజుడు. అవన్నీ మానవుని సోదరవర్గం. మానవుని సంస్పర్శతో, ప్రోత్సాహంతో ఎదిగిరావలసినవి. కాని అలాంటి మానవుడు నిరంతరం వేష్టపడటమేమిటి? తాను ఉద్వేగానికి గురిఅవుతూ, ఇతరులను ఉద్వేగానికి గురి చేయడమేమిటి? ఏమిటీ చేతకానితనం! ఏమిటీ దీనత్వం! నిత్యకళ్యాణం పచ్చతోరణంలా ఉండవలసిన జీవితం అల్లకల్లోలమై అలమటించడమేమిటి? ఈ చేతకానితనం నుండి. ఈ దీనత్వం నుండి మానవుడు బైటపడాలి.

ఇతరులు మనను ఉద్వేగానికి గురిచేయడానికి ప్రయత్నిస్తున్నారు. అంతమాత్రాన మనం ఉద్వేగ పడాలని ఉందా? వారి ప్రయత్నాన్ని గమనించాలి. ఏయే త్రిగుణ దోషాలవల్ల వారలా ప్రవర్తిస్తున్నారో



బోధపరచుకోవాలి. ప్రవర్తన ఎప్పుడూ గుణమయమయినదే! చేతనయితే వారిని ఆ గుణదోష స్థితినుండి ప్రక్కకు నడిపించండి. వారు కూడా సంతోషించేటట్లుగా చేయండి! అప్పుడు వారూ, మనమూ కూడా ఉద్వేగం మాట అటుంచి, ఉత్సాహంగా గడవగలుగుతాము. ఇలా వారి గుణ ప్రవర్తన నుండి వారిని ఈవలకు లాగగలగడం ఒక కళ. లోకంలో ఈ కళ కొందరిలో కనబడుతూనే ఉంటుంది. వారు ఎంతటి వారినయినా క్షణాలలో మామూలు స్థితికి తీసుకురాగలుగుతారు. అంటే ఏమిటి? ముందు వారు బెదరలేదు. ఇవతలి వారి బెదురుబాటును కూడా క్షణాలలోనే సర్దుబాటు చేయగలిగారు.

మా మేనమామగారు ఒకాయన ఉండేవారు. ఆయనతో ఎలాగయినా పోట్లాడాలని కొందరు రిహార్సల్ వేసికొని మరీ వచ్చేవారు. వారు రాగానే మా మామయ్య ఒక చిరునవ్వు నవ్వేవాడు, "ఏం బాబాయ్, ఇలా వచ్చావ్, రా కూర్చో!" అనేవాడు. ఏం జరిగేదో, ఏమో వచ్చినవాడు చల్లబడిపోయేవాడు. చిరునవ్వులు నవ్వేవాడు. చివరకు నవ్వుకొంటూ వెళ్లేవాడు. ఇలాంటిఘట్టాలు కొన్నివందలు చూసాను ఆయన దగ్గర. ఆహాఁ ఏమి కళ ఇది! అనుకొనేవాడిని. ఆయన ఉద్వేగం చెందడు, ఇతరులను ఉద్వేగం చెందనీయడు, చాలా చిత్రంగా ఉండేది, మా అత్తయ్యతో ఆయన మాట్లాడేటపుడు కూడా అంతే! లోపలికి రాగానే విషయమేదో తేల్చాలనుకునేది ఆమె. ఆయన లోపలకు రావడమేమిటి ఏదో లోకాల్లో తేలియాడేది. ఆయన ఆవిడను ఆటపట్టించి, ఆవిడ ఏమేమి అనదల్చుకుందో, కూడా ఆయన చెప్పేసి, ఏది ఎప్పుడు జరుగుతుందో కూడా చెప్పేసేవాడు. ఇక ఆవిడకు ఆరడిపెట్టే అవకాశమేది? లోపలకు రావడమే ఆ, రడీ, అనేది.

ఒకసారి ఒక దగ్గరచుట్టం. చాలా దగ్గర చుట్టం వచ్చి, ఆయన దొడ్డిగుమ్మానికి ఎదురుగా నిలబడి ఆయన్ని దుమ్మెత్తి పోస్తోంది. మా అత్తయ్యకు ఇక ఎలా ఉంటుందో ఊహించండి! మా మామయ్య తన కార్యాలయంలో ఇంటి ముందు వరండాలో ఉన్నాడు. ఆయన్ని పిలిచి ఈ దృశ్యం చూపించాలని మా అత్తయ్య ఎంతో ఇదైపోతోంది. ఎట్టకేలకు ఆయన్ను లోపలికి రప్పించింది. దొడ్డి గుమ్మం దగ్గరకు రప్పించింది. 'చూడండి ఆ పరిస్థితి' అంటూ భోరున ఏడ్చింది. 'దేవుడు లాంటి మనిషిని ఎలా అంటుందో చూడండి. మీరెలా ఉన్నారోగాని, నేను వినలేకపోతున్నాను. ఏమిటండీ దారుణం!' అంటూ ఆర్తనాదాలు చేసింది. మా మామయ్య ఆ సన్నివేశంవైపుకు ఒక్కసారి చూసాడు. ఒక అయిదు నిమిషాలు అలా నిలబడ్డాడు. ఆయన అలా నిలబడ్డాడో లేదో ఆవిడ నోరు తగ్గిపోతుంది. ఆయన ఏమీ అనలేదు. చివరకు ఒక్కమాట అన్నాడు. "అది మాత్రం ఎవరు? నాకేమయినా కానిదా? దానికేదో బాధ కలిగింది. ఇప్పుడు తిడితే ఏమయిందట, నాకేమన్నా పరాయిదా ఇది! ఊరికే హడావిడి పడతావు. చనువు కొద్దీ అంటోంది. అననీ" అని మరి రెండు నిమిషాలు నిలబడి తన కార్యాలయంలోనికి వెళ్లిపోయాడు. ఇక తిడుతున్న ఆవిడకు నోరు పెరగలేదు. కాలూ, చేయి ఆడలేదు. అక్కడే కూర్చుండిపోయింది. ఆయన వెళుతున్నవైపు చూస్తూ,



కాసేపు ఆగి తలదించుకొని మౌనంగా లేచి వెళ్ళిపోయింది. ఇక్కడ చూడండి ఏం జరిగిందో. ఎదుటివారి వలన ఆయన ఉద్వేగాన్ని చెందలేదు, సరికదా, ఎదుటివారి ఉద్వేగాన్ని కూడా చల్లబరిచాడు.

ఈ లక్షణం ఆయనకు చిన్నప్పటి నుండి ఉండేది. పద్నాలుగేళ్ల వయస్సులో పొలాన రాత్రిపూట వడ్లరాశిపైన ఒక్కడే పడుకొని ఉన్నాడు. పదిహేను, ఇరవైమంది దుండగులు దుడ్డుకర్రలను తీసికొని, 'కుర్రవాడు ఒక్కడే ఉన్నాడు, కొట్టి, వడ్లు తీసికొని వద్దాము' అని బయలుదేరారు. కర్రలు వెనక్కు పెట్టుకొని నడుస్తున్నారు, దగ్గరకు వెళ్లిన తరువాత, ఒక్కసారిగా కర్రలను ఎత్తికొట్టేయాలని వారి ప్రయత్నం. వారు దగ్గరకు వస్తున్నారు. ఈ కుర్రవాడు లేచి కూర్చున్నాడు. వడ్లరాసి చాలా పెద్దదిగా, వెడల్పుగా ఉంది. 'ఏం బాబాయ్, ఇలా వచ్చారు. రండి అందరం కూర్చుందాం' అంటూ ఆహ్వానించాడు ఆ కుర్రవాడు. ఆశ్చర్యం! వారి దుడ్డుకర్రలు చేతినుండి జారిపోయాయి. వారి దుడుకుతనం మనస్సునుండి జారిపోయింది. వారందరూ ఆ వడ్లరాసిపైన చుట్టూతా కూర్చున్నారు. చెప్పిన కబురు చెప్పకుండా చెబుతున్నాడు కుర్రవాడు. ఇంతలో తెల్లవారిపోయింది. వారు పశ్చాత్తాపపడి, తప్పు ఒప్పుకొని, క్షమించమని కోరి వెళ్లిపోయారు. కనుక మానవుడు ప్రేమమయుడయి, అంతటా దైవాన్ని చూస్తూ, మనస్సుకూ, ఇంద్రియాలకూ తగిన శిక్షణనందిస్తూ జీవించిననాడు ఇంత హాయిగా జీవించగలడు. అప్పుడు మానవజన్మను మనం సార్ధకం చేసుకొన్నట్లవుతుంది.

అలాంటి అమృతమూర్తికి అంతిమఘడియలు వచ్చాయి. దేహాన్ని విడిచి పెట్టవలసి వచ్చింది. ఊరిపెద్దలందరూ ఉన్నారు. అప్పుడు కూడా ఆయన ఉద్వేగాన్ని చెందలేదు. పెద్దలందరికీ పేరుపేరునా వీడ్కోలు చెప్పారు. 'వెళ్లొస్తాను బాబాయ్' అంటూ శెలవు తీసుకొన్నాడు. మా అత్తయ్యకు ఏడుపొస్తోంది. ఆయనిలా అన్నాడు. 'ఏడుపు రావడం సహజం. నిన్ను నేను తప్పుపట్టను. నన్ను మాత్రం ప్రశాంతంగా వెళ్లనీ, తరువాత కథ ఎలాగూ తప్పదు' అంటూ మా అమ్మను చేరబిలిచాడు. 'చెల్లీ! నారాయణశబ్దాన్ని నా చెవిలో వినిపించమ్మా! నా ప్రయాణం పూర్తయ్యేవరకు' అన్నాడు. మా అమ్మనుండి స్మరణ ప్రారంభమైంది. ఆయన ప్రయాణం నారాయణ మయమైంది. చుట్టూ ఉన్న పెద్దలు శోకానికి బదులుగా భక్తి శ్రద్ధలతో "మీరు ధన్యులు! వెళ్లిరండి. మీతో జీవించగలిగిన మేము ధన్యులం!" అంటూ నమస్కరించారు. చూడండి. చివరి క్షణంలో కూడా ఆయన ఉద్వేగం చెందలేదు. తోటివారిని కూడా ఉద్వేగంలో ఉంచలేదు. అందరినీ ధన్యులను చేశారు. తోటివారివలన మనం ఉద్వేగపడకూడదు. తోటివారిని మనం ఉద్వేగ పరచకుండా ప్రేమమయజీవనం గడపాలి. మానవుడికి అది సాధ్యపడాలి! అందరూ మహాత్ముల అడుగుజాడలలో ముందుకు సాగాలి! ఆ అడుగుజాడలు చాలు, ఆ దివ్యస్థితిని మనకు అలవోకగా అందించడానికి.

మానవుని ప్రవర్తన త్రిగుణాలపైన ఆధారపడి ఉంటుంది. త్రిగుణాల నిష్పత్తిని బట్టి అతని ప్రవర్తన



అనేక విధాలుగా వ్యక్తమవుతూ ఉంటుంది. సాధకుడయినవాడు ఈ త్రిగుణాల పూర్వాపరాలను సాకల్యంగా గమనించుకొంటాడు. అవి తనలో ఎలా పనిచేస్తున్నాయి, తోటివానిలో ఎలా పనిచేస్తున్నాయి – అన్న గమనిక కలిగి ఉంటాడు. అంతటా దైవమే అతనికి గోచరిస్తూ ఉంటుంది. కనుక ఈ త్రిగుణాల నిష్పత్తిని ఇటు సర్దుకొని, అటుకూడా సర్దగలుగుతాడు. తెలియక మనం ప్రవర్తన మనిషిది అనుకుంటున్నాము. అది సరికాదు. కేవలం మనిషిలోని త్రిగుణాలకు సంబంధించినది. దాని ఆనుపానులను తెలిసినవాడు అనుభవజ్ఞుడు. ఒక యంత్రాన్ని అవలీలగా ఎలా నడుపుతున్నాడో, యోగి అయినవాడు తనను, తన ప్రవర్తనను అలాగే నడపగలుగుతున్నాడు. అప్పుడు ఉద్వేగము చెందే మానవుడుగా కాక, ఉత్తమ మానవుడిగా జీవించి తన జీవనయాత్ర వలన ఈ సృష్టికి ఒక సరిక్రొత్త శోభను అందించి వెళతాడు. ఉన్నంతకాలం అందరినీ ఆనందింపచేస్తాడు. శరీరం విడిచిన తరువాత అందరికీ ఆదరం అవుతాడు. శ్రీకృష్ణుడు ఇలా ఆడుతూ, పాడుతూ అందరినీ ఆటపట్టిస్తూ ఆటకట్టిస్తూ జీవించినవాడే! జీవితమే ఒక క్రీడ. జీవితమే ఒక లీల. జీవితమే ఒక ఉత్సవం అన్నట్లు జీవించాడు. చివరకు అతడు జరిపిన సంహారాలలో కూడా లీల కనబడుతుంది., తప్ప ఉద్వేగము కానరాదు. సంహారసమయాన ఆ సంహరింపబడుతున్నవారు నిజస్థితిలోనికి మేలుకొనడమే చాలా చోట్ల కనబడుతుంది. ఇక ఉద్వేగానికి తావెక్కడుంటుంది. అంతా ఒక క్రీడ! అంతా ఆనందప్రదమయిన ఒక ఉపదేశం! ఇలా గడిచిపోయిందతని జీవితం. చివరకు కురుక్షేత్రంలో కూడా అతడు వ్యక్తులను శిక్షించలేదు. వారి త్రిగుణాల నిష్పత్తికి మాత్రమే బుద్ధి చెప్పాడు. వారిని మాత్రం తనలోనే నిలుపుకున్నాడు. తనకన్నా వేరైనది ఏమున్నది? అంతా తానే అయినచోట ఉద్వేగమునకు చోటెక్కడ ఉన్నది? సరిగా మా మేనమామగారు కూడా ఇలాగే చేసేవారు. ఒక్కొక్కప్పుడు గుణనిష్పత్తి ప్రభావం వల్ల, పేట్రేగినవేళ శిక్షణ నివ్వవలసివచ్చేది. శిక్షణనిచ్చేవారు, శిక్షణ ఇవ్వగానే, అవతలివారికి సత్యదర్శనం కలుగగానే అక్కున చేర్చుకునేవారు. "పిచ్చివాడా! నిన్ను నే వదిలిపెడతానట్రా!" అనేవారు. అతడు కదిలి పోయేవాడు. కరిగిపోయేవాడు. తాదాద్మ్య స్థితిని అనుభవించేవాడు. లోకంలో మన కథకూడా అలా సాగాలి!

జీవితంలో హర్షాన్ని కలిగించే సన్నివేశాలు వస్తాయి. రోషాన్ని కలిగించే సన్నివేశాలు వస్తాయి. భయాన్ని కలిగించే సన్నివేశాలు వస్తాయి. అప్పుడు కూడా మనం ఉద్వేగం చెందకూడదు. సంతోషాన్ని దేవుని ప్రసాదంగా స్వీకరించండి! రోషానికి తగిన శిక్షణ పొందాలని తెలుసుకోండి! భయానికి భయపడవలసిన పనిలేదని గ్రహించాలి. అంతటా ఉన్నది దైవమే అయినపుడు ఇక భయానికి చోటెక్కడ? ఎక్కడ మనం దైవాన్ని చూడటానికి ఏమరుపాటు చెందుతామో, అక్కడనుండి భయం పుడుతుంది. దైవాన్ని చూసిన మరుక్షణంలో భయం తొలగిపోతుంది. నిజానికి అంతటా ఉన్నది అతని అభయమే.

సన్నివేశాల స్వరూపస్వభావాలు తెలిసినపుడు ఉద్వేగానికి అవకాశమేమున్నది. ఇంతకూ మనం

సృష్టిలోనికి దిగివచ్చింది, ఉద్వేగపడటానికి కాదు. ఉద్వేగపరచడానికీ కాదు. ఉద్యోగాన్ని నిర్వహించడానికి. తోటివారితో నిర్వహింపచేయడానికి. ఉద్యోగమంటే ప్రయత్నం. మానవుడు నిరంతరం ప్రయత్నం చేయాలి. దేవుని ఆజ్ఞకు అనుగుణంగా అతని ప్రయత్నం అఖండంగా కొనసాగాలి. ఈ సృష్టికి దైవం మరింత పరిపూర్ణతను ఇవ్వాలనే ప్రయత్నంలో ఉన్నాడు. అందుకు మన ప్రయత్నం తోడుకావాలి. దేవుని సంకల్పానికి అనుగుణంగా మానవ ప్రయత్నం సాగినరోజున ఆ మాధుర్యాన్ని ఇక వర్ణింపతరమా? ఆ అనుభూతికి ఇక అవధులుంటాయా? దివ్యజీవనమంటే అదే! దేవుని ప్రకారం జీవించగలగడం! **భక్తి అంటే దేవుని గూర్చి ప్రచారం చేయడం కాదు. దేవుని ప్రకారం జీవించగలగడం.**



**– పార్థసారధి ప్రవచనాలు**

## నిరాడంబరతకే ప్రాధాన్యం

తిరువణ్ణామలైలో అరుణాచలేశ్వరుణ్ణి సందర్శించుకున్న భక్తులు రమణాశ్రమానికి వచ్చి వెళ్లేవారు. కొందరు ఆదివారం సెలవు రోజు గనుక స్వామిని సందర్శించుకుని, నమస్కరించి వెళ్లేవారు. కోయంబత్తూరు నుండి ఒక వస్త్రవ్యాపారి రమణుని శిష్యుడు. ఆయన ఆదివారం వచ్చేటపుడు ఓ బుట్టలో పళ్ళు, గోనె సంచిలో కూరలు తెచ్చేవారు. రమణుల అనుమతితో వంటశాలలో పెట్టేవారు. శ్రీరమణమహర్షి ఎప్పుడూ గోచీతో కనిపించేవారు. అది ఆ కోయంబత్తూర్ చెట్టియార్‌కి నచ్చలేదు. తనకి చాలా పెద్దవస్త్ర దుకాణం ఉంది. వ్యాపారం కూడా మూడు పువ్వులు, ఆరు కాయలుగా ఉంది. అదంతా రమణుల ఆశీర్వాద బలమేనని ఆయన ప్రగాఢ విశ్వాసం. చాలాకాలం నుంచి రమణమహర్షికి పట్టుపంచ, ఉత్తరీయం కానుకగా ఇవ్వాలనేది ఆయన ప్రగాఢమైన కోరిక. కానీ ఎప్పుడు చెప్పినా రమణులు 'నాకెందుకు, నేనొక అర్ధ దిగంబరుణ్ణి. నాకు ఆడంబరాలు ఇష్టం ఉండవు' అని సున్నితంగా తిరస్కరించేవారు. చివరికి చెట్టియార్ కంచిలో సొంత మగ్గాలపై నేయించిన జరీ అంచు పట్టు పంచె, పెద్ద ఉత్తరీయం తీసుకుని వెండి పళ్లెంలో సమర్పించి ధరించమని బలవంతపెట్టారు. మిగిలిన శిష్యబృందం కూడా వంతపాడారు. రమణులకు కోపం వచ్చింది. కళ్ళు ఎర్రబడ్డాయి. పెదిమలు వణుకుతున్నాయి. అటువంటి స్థితిలో రమణమహర్షిని చూడటానికి శిష్యులు కొంచెం భయపడ్డారు. "మీరు మూర్ఖులు. చెప్పిన మాట వినరు. పట్టుబట్టలు నేను ఎప్పుడూ ధరించను అని చాలాసార్లు చెప్పాను. కారణం ఏమిటని ఎవరూ అడగలేదు. కనీసం అడగాలని ఎవరికీ అనిపించలేదు. చెబితే వినాలి. తెలియకపోతే అడగాలి. అంతేగానీ మీ ఇష్టం వచ్చినట్టు మీరు చేస్తే నాకు నచ్చదు" అని తీవ్రమైన స్వరంతో అన్నారు రమణులు.

ఆశ్రమంలో శిష్యులు అవాక్కయ్యారు. చెట్టియార్‌కి ముచ్చెమటలు పట్టాయి. తను చేసిన అపరాధం



ఏమిటో అతనికి బోధపడలేదు. కాసేపయ్యాక స్వామి శాంతించారు. "శ్రద్ధగా వినండి. నేను పట్టుపీతాంబరాలు ధరించను. దాదాపు రెండు లక్షల పట్టుపురుగులు పెట్టిన గూళ్ళు సలసలకాగే నీళ్లలో వేసి ఉడికిస్తారు. పట్టుగూళ్లు మెత్తబడతాయి. అవి ఎండాక దాన్నుంచి సన్నని దారం తీస్తారు. అంటే మనం ఆనందం కోసం రెండులక్షల పట్టుపురుగుల్ని క్రూరంగా హింసించి చంపుతున్నాం. అది ప్రకృతి విరుద్ధం. అంత హింస చేసి దుస్తులు ధరించాల్సిన అవసరం లేదు. ఇప్పుడు కారణం మీకు తెలిసింది కాబట్టి నామీద గౌరవం ఉంటే పట్టు వస్త్రాలు ధరించకండి. అవి ధరిస్తే మన ఒంటి మీద లక్షలాది పట్టుపురుగులు పాకుతున్న అసహ్యం కలుగుతుంది. మన ఆనందం కోసం మరొక జీవిని చంపే అర్హత మనకు లేదు. అందరూ నూలు దుస్తులు ధరించండి" అని చెప్పి స్వామి గదిలోకి వెళ్లిపోయారు. శిష్యులంతా ముక్కున వేలేసుకున్నారు. చెట్టియార్ అప్పటినుండి పట్టువస్త్రాలు అమ్మటం మానేసి నూలు వస్త్రాలు అమ్మటం ప్రారంభించారు.

**సేకరణ : గురుకృప**

# సంస్కృతి - సంస్కారం

సంస్కృతి ఒక జాతి ఉన్నతిని నిర్దేశిస్తే, సంస్కారం ఒక వ్యక్తి తాలూకూ అద్భుత, అలౌకిక, అనిర్వచనీయమైన గుణగణాలను దశదిశలా వ్యాపింప జేస్తుంది. అలాగే ధార్మిక, సామాజిక, వ్యక్తిగత అభివృద్ధి  సంస్కారం వల్లే సాధ్యమవుతుంది.

ఒకసారి మేము అరుణాచలం వెళ్లినపుడు అమెరికా నుంచి వచ్చిన వాళ్లు కొంతమంది వున్నారక్కడ. ఒక క్రైస్తవ దంపతుల జంట అరుణాచల శిఖరం మీద ఉన్నారు. మాలో ఉన్న మా పినమామగారు MES officeలో Superintendent గా పని చేస్తున్నారు. మంచి ఇంగ్లీష్ మాట్లాడేవారు. మేము అప్పుడే అరుణాచలం కొండమీదకి ఎక్కాం. వాళ్లు అంత దూరంలో కనబడుతుంటే అంతదూరం ఎలా వెళ్లారా? అని అనుకున్నాం. చాలా దగ్గరకి వచ్చారు. వారితో ఒక పాలవాడు ఉన్నాడు. అతన్ని అడిగా. ఎవరు వీళ్ళు అని. వీళ్లు అమెరికా నుండి వచ్చారండి. (మెడలో శిలువ కూడా ఉంది) వాళ్లు ఈ అరుణాచలం కొండలన్నీ చూస్తున్నారండీ. లోపల గుహలో ఒకాయన ఉన్నారు. ఇంతంత గోళ్లు పెరిగి, తిరిగిపోయి వుంటారు. నేను ప్రతిరోజూ ఒక గ్లాసు పాలు పెడతాను. అవి త్రాగితే త్రాగినట్టు. త్రాగకపోతే తాగనట్టు. మౌనంగా వింటారు. వీళ్లు ఎంతో ప్రాధేయపడితే వీళ్లకు ఆ స్వామిని చూపించడానికి తెల్లచీరకట్టించి బయలుదేరి వచ్చి చూపించాను అన్ని సమాధానం. మా పినమామగారు ఆవిడకు షేక్‌హ్యాండ్  ఇవ్వబోయారు. పరిచయాలలో ఆవిడ రెండు చేతులతో నమస్కరించి, మా పినమామగారి కాళ్లమీద పడి లేచి, కళ్లలో నీళు తిరుగుచుండగా "You are so lucky that you have born in a country like India. Especially



by travelling 12 or 13 hours you will be reaching Tiruvannamalai. Such a place of Sanctity on seeing the saints - really I am amazed. I am very sorry that I have not born in country like India. You are very lucky I prostrate before you. I salute to you, I don't want to shake my hands with you. I am sorry" అన్నది. అటువంటి సంపదకు వారసులం. అటువంటి గడ్డపై పుట్టినవారం. అంతటి కర్మభూమిపై జీవిస్తున్నవాళ్లం. దీనికి మనం ఎంత ఆనందపడాలి. ఎంత కర్తవ్యం వహించాలి. ఎంత ఋణం తీర్చుకోవాలి, ఎంత ఋణపడి ఉన్నాం.

Secret doctrine (గుప్తవిద్య), బ్రహ్మవిద్యకు, విజ్ఞాన శాస్త్రమునకు వారధి. బ్రహ్మాండ పిండాండ సృష్టి సమన్వయ విజ్ఞాన కోశమిది. Book of Dhyan అను పవిత్రమగు ప్రాచీనమగు వేదగ్రంధమునకిది సమగ్ర వ్యాఖ్యానము. రచయిత బ్లావెట్స్కీమాత్ మొట్టమొదటి భారతదేశమున కాలూనినపుడు భరతభూమి ఇసుకపై పొర్లాడినదట. వేదములు పుట్టిన పుణ్యభూమి అనియు, అవతార మూర్తులు, మహర్షులు, మహాత్ములు, గురువులు తిరుగాడిన అమరభూమి అనియు భారత భూమిని కీర్తించి, ఆ ఇసుకను తన గుండెకు హత్తుకున్నదట. పుట్టుకతో క్రైస్తవురాలయినను ఆమె ప్రేమమూర్తియగు క్రీస్తునందు భక్తి కలిగియుండెడిదే గాని, చర్చి క్రైస్తవము యొక్క ఆధిపత్యమును అంగీకరించ లేదు. ఈ దేశవాసులు తమదైన సంస్కృతి, చరిత్రల ఔన్నత్యాన్ని విస్మరించి, పరవ్యామోహంతో పతనమవుతుంటే ఆ పరదేశీయులు ఈ దేశపు ఔన్నత్యాన్ని గుర్తించి, ఆరాధిస్తున్నపుడు "అయ్యో మన విలువ మనం తెలుసుకోలేకపోతున్నామే" అది గుర్తించలేకపోతే, ఆ గ్రహింపులో మనం లేకపోతే ఈ దేశం క్రమంగా వ్యక్తిత్వం లేని బానిసత్వానికి దిగజారక తప్పదు. ఇట్టి సందర్భాలలో మహాత్ములు ఉద్భవించి ఈ భూమి ఔన్నత్యాన్ని చెబుతూ, చూపుతూ మనల్ని నిలబెట్టేందుకు వస్తున్నారు.

***సేకరణ : గురుకృప***

## శ్రీబాబూజీ

నిరాడంబరత వారికి పెట్టని ఆభరణం. ఆత్మీయత వారి సహజగుణం. జీవితంలో రాజీపడటం నిషిద్ధం. ప్రతి విషయాన్ని కూలంకషంగా శోధించి దానిలో పరిపూర్ణత్వాన్ని సాధిస్తారు. వారు నమ్మిన సిద్ధాంతాన్ని ఎవరి కోసం మార్చుకునే వారుకాదు. చిరునవ్వుతోనే తమ తప్పు తామే తెలుసుకునేట్లు చేసి మరల అటువంటి పొరపాటు ఎన్నడూ చేయకుండా ప్రతి వారిలోనూ మౌలిక పరిణామం తీసుకురాగలరు. మన అభిరుచులకు, సంస్కారాలకు తగినట్లుగానే వారు మనతో వ్యవహరిస్తూ సరైన సమయంలో సరైన సంఘటనలు కూర్చి మనలను తీర్చి దిద్దుతారు.

**– సాయిదీవెన**

**సాయి సమగ్రదర్శిని : www.saibaba.com** **సద్గురు తత్త్వ దర్శిని : www.gurukrupa.info**
**గురుబంధువులు తమ అనుభవాలను పంపవలసిన** mail ID : **gurukrupa@saimail.com**



## నామకోటి - ఏది మేటి?

ఒకసారి యోగనందుల వారిని కలసిన త్యాగరాజుల వారికి "నీవు రాముని ఉపాసకుడవై ఆ రామనామాన్ని కోటిసార్లు జపించు" అని చెప్పారు. త్యాగరాజు ఆయన పలుకులను శ్రద్ధతో ఆలకించి కోటి జపం చేయనిశ్చయించినారు (రామకోటి వ్రాసినట్లు). యోగనందులు అతని సంకల్పాన్ని గ్రహించి, వెడుతున్న త్యాగరాజుని పిలిచి, ఏం చేయాలో గ్రహించావా? అంటూ ప్రశ్నించారు. రామనామ జపం చేస్తానని ప్రత్యుత్తరమిస్తాడు. యోగానందులు ఇలా అన్నారు "త్యాగరాజా! నీవు విద్యావంతుడవే, బుద్ధిమంతుడవే, ప్రజ్ఞావంతుడవే, నామజపమంటే, ఇదేనా అర్థం చేసుకున్నది?" అంటూ "ఒక కోటి నామజపం అంటే ఓ కోటి జనానికి రామనామం నొసగుట, వారిని రామునియందు, రామునివైపుకు ఉన్ముఖులను చేయుట. ఈనాడు మానవుడు సంపాదిస్తాడు, తింటాడు, పడుకుంటాడు, పశువులా చస్తాడు. తనను సంరక్షించే భగవంతుని విస్మరిస్తాడు. ఇలాంటి దైవ విముఖులను దైవం వైపుకు త్రిప్పుట. వారు తినువేళ, మేల్కొనువేళ, ఇతర కార్యములొనర్చు వేళలందు భగవంతుని స్మరణాదులు జరుపుకునేట్లు చేయాలి; ఇదే వాస్తవమైన నామజపం". అని చెప్పారు యోగనందులవారు. సోదరా! కేవలం భగవంతుని గుణగణాలను స్తుతిస్తూ, భగవంతుడు దయాళుడని, పతితపావనుడని, కరుణానిధి అని ప్రమాణ పత్రమిచ్చిన ప్రసన్నుడవుతాడా? ఇది ఒట్టి భ్రమ. ఇది అసలు సిసలైన భక్తి కాదు. నామస్మరణ కేవలం మనశ్శాంతి కొరకే. దానివలన దివ్యత్వం ప్రాప్తించదు. కేవలం నామం జపించుట భిక్షకుల భాష. నామసంకీర్తనతోపాటు దైవ కార్యాన్ని ఒనర్చువాడు నిజమైన భక్తుడు.

## జగద్గురువులు

Christ అన్న పదానికి అర్థం రక్షకుడు అని. రక్షకుడు అన్న పదానికి 'అవతారమూర్తి' అని అర్థం. తెలియని వారు దీనిని ఒక వ్యక్తి యొక్క పేరుగా భ్రమపడే అవకాశముంది. అవతారమూర్తి అంటే ఒక వ్యక్తి యొక్క పేరు అవడానికి అవకాశం ఎలా లేదో – 'రక్షకుడు' అన్న పదం కూడా ఒక వ్యక్తి యొక్క పేరు అవడానికి వీలు లేదు. Jesus Christ అని మనం అన్నపుడు Jesus అన్నది ఆయన పేరు. Christ అన్నది ఆయన నిర్వహిస్తున్న బాధ్యతను తెలియచెప్పే పదం. Jesus అనే పరమగురువు Christ కావచ్చుకాని, Christ అంటే Jesus అన్న అర్థం ఎక్కడా లేదు. శ్రీరామచంద్రుడు అవతారమూర్తి. కాని అవతారమూర్తి అంటే శ్రీరామచంద్రుడు మాత్రమే కాదు. అది ఒక బాధ్యతను తెలియచెప్పే పదం. ఎవరి ద్వారా ఆ బాధ్యత నిర్వర్తింపబడుచున్నదో వారికల్లా ఆ పదం వర్తిస్తూ ఉంటుంది. జగద్గురువు అనగానే శ్రీకృష్ణుడు మనకు గుర్తుకు వస్తాడు. దానికి పరమాచార్యుల వారిని ఓ పాశ్చాత్యుడు "మిమ్మల్ని జగద్గురువు అంటున్నారు. మీరు నాకు గురువు కాదు కదా! అయితే మీరు జగద్గురువు ఎలా అవుతారు" అని అడుగుతాడు. అప్పుడు స్వామివారి సమాధానం "నేను" జగత్తుని గురువుగా స్వీకరించాను. కనుక జగద్గురువు అని చెపుతారు.. సమన్వయం దొరికింది పాశ్చాత్యునికి.

**– సేకరణ : గురుకృప**

# ఒ'యాసిస్సు' గురుకృప



సర్వ సమర్ధుడైన సద్గురు సామ్రాట్టు శ్రీసాయినాథునికి, పూజ్య గురుదేవులు శ్రీసాయినాధుని శరత్‌బాబూజీ చరణ కమలాలకు నమస్కరిస్తూ – ఇది అనుభవమని చెప్పాలంటే ఎందుకో సంశయంగా ఉంది. నేను అనుభవమనుకుందామంటే – మరో 'నేను' ఇది సహజ మాతృత్వమని చెపుతోంది. నిజానికి సద్గురుదేవులు నన్ను మాతృమూర్తిగానే అక్కున చేర్చుకున్నారు. ఈ క్రింది భావాలు నేను సంతోషంగా లేవని చెపుతున్నాయనిపిస్తే కొన్నిసార్లు అవుననిపిస్తుంది.

సద్గురుదేవులు నాకు అందించిన ప్రేమైక కుటుంబం విశాఖ సత్సంగం – గురుబంధువులు – చిన్నారులు. 2001–2007 సం॥ల మధ్య నా జీవితం ఎన్నో మలుపులతో, సద్గురుని విశేషమైన అనుగ్రహపు చిరుజల్లులతో సాగిపోయింది. చిన్న ఉద్యోగం– నెలకు సరిపడా జీతం, అవసరమైతే చేబదులుల పర్వం – చిన్న ఇల్లు – సదా సద్గురు స్మరణ, మనన, ఆలోచనలు – ప్రేమ ప్రతిరూపాలైన గురుబంధువుల ఆప్యాయతలు. వృత్తిపరమైన ఇక్కట్లున్నా నాకు అవి అట్టే ఇబ్బందిగా తోచలేదు. సత్సంగం, చిన్నారులతో నాటకాలు, సాయిస్మరణ నాకు ఎప్పుడూ ఆ ఇక్కట్లను గుర్తింపులో లేకుండా చేసాయనిపిస్తుంది. 2007 సం॥లో నాకు 'ఇతరులతో పోల్చి చూసుకోవడమనే' (Comparision) రోగమొచ్చింది. చాలా సంతోషంగా గడిచిపోతున్న నా జీవితం గురువుగారి చరణాలను ఇలా వేడుకునే పరిస్థితికి తెచ్చింది. "గురువుగారూ! సమాజం నన్ను చూసి సాయిబాబా, సాయిబాబా అంటూ ఉండటమే కాదు, వీళ్లు ఏదైనా సాధించగలరు అని అనిపించుకోవాలని ఉంది" అని వేడుకున్నాను.

అడిగిందే తడవుగా నాకు ప్రపంచ ఔషధ రంగంలో అగ్రగామి సంస్థ అయిన "ఫైజర్"లో హైదరాబాద్‌లో ఉంటూ ఆంధ్రప్రదేశ్ మొత్తం పనిచేసే ఉద్యోగావకాశం వచ్చింది. విశాఖ నుంచి కన్నీళ్లతో రాజధానికి వచ్చేసాను. చేరిన 15 రోజులలోనే నేను ఏ ఔషధం కోసం చేరానో దానిని మార్కెట్ నుంచి తొలగించారు. అగమ్యంగా మారిన నా భవిష్యత్‌ను కంపెనీ 'చిన్న పిల్లల ఎదుగుదలకు' సంబంధించిన ఒక ఉత్పత్తిని అందచేసి మొట్టమొదటిసారిగా ఆంధ్రాలో నన్ను నియమించింది. చేరిన కంపెనీ అగ్రగామి అయినా, ప్రమోట్ చేసేది ఉత్తమమైన ఉత్పత్తి అయినా సద్గురు అనుగ్రహమే నన్ను ఒక కొత్త రూపుకు తెచ్చిందని చెప్పడంలో నాకు అతిశయోక్తి కన్పించడం లేదు. చేరిన క్రొత్తల్లో నా భార్య నన్ను అడుగుతూ ఉండేది, "ఈరోజు వర్క్‌కి వెళ్లడం లేదా?" అని. నా సహచరులు కొంతమంది "ఈ మందు పనిచేయదండీ! ఏదైనా మరొక ఉద్యోగం చూసుకోండి" అని అనేవారు. ఎక్కడో ఒక మూలన చిన్న ఆశ. ఇక్కడికి వచ్చేటపుడు 'ఏదో సాధించాలని' నా తండ్రిని వేడుకున్నాను. ఈ రోజు వరకు తన అనుగ్రహంతో నన్ను నేను చిన్నబుచ్చుకునేట్లు చేసాడేకాని, నన్ను చిన్నవాడిని చేయలేదే అన్న విశ్వాసం.

మొదటి సంవత్సరం కొంచెం కష్టంగా, కొంచెం వృత్తిపట్ల ఇష్టంగా గడిచింది. రెండవ సంవత్సరానికి



ఒక చిన్న ఆశయం, ఆశ ఏర్పడింది. అప్పటి వరకు కంపెనీలో నాది చివరి నుండి రెండవస్థానం. సాయి సద్గురుదేవులకు నా వినతులు వెల్లువలయ్యాయి. గొప్పగా చెయ్యాలి - గొప్పగా సాధించాలి అని. అలా మొదటిసారి 2010 సం॥నికిగాను కంపెనీలో సంవత్సర విశిష్ట వ్యక్తిగా (నా విభాగంలో) అవార్డు లభించింది. అందుకుగానూ నా కుటుంబంతో సింగపూర్ వెళ్లమన్నారు. సరే! నాకున్న పనిపిచ్చి వ్యాధికి నేను 2011వ సం॥ వరకు కనీసం పాస్‌పోర్టుకు కూడా అప్లయ్ చేయలేదు. కంపెనీ - మీరు ఈ సంవత్సరం వెళ్లకపోతే ట్రిప్‌ను రద్దు చేసుకోవాలనడంతో పాస్‌పోర్టు అప్లయ్ చేసాను - నాకు, నా శ్రీమతికి. నా చిన్నారులిద్దరికి పాస్‌పోర్టు కోసం హైదరాబాద్ పాస్‌పోర్టు ఆఫీస్‌లో ఉండగా మా కంపెనీ ప్రధాన కార్యాలయం నుండి ఫోన్ వచ్చింది. నా పైన ఉన్న ముగ్గురు అధికారులు ఫోన్‌లో లైన్‌లో ఉండి, నాతో మాట్లాడాలన్నారు. నేను అనుకున్నాను - నేను సీనియర్‌షిప్ కోసం అడిగిఉన్నాను. ఆ విషయాన్ని నాకు చెప్పబోతున్నారని! అయితే ఒక్క విషయం మరచిపోయాను - నేను సాయిసద్గురు మహరాజ్ బిడ్డనని! 2009, 2010, 2011 సం॥లకు గానూ సంస్థ ఉత్పాదకతకు ఎనలేని సేవలందించినందుకు నేను పనిచేసే విభాగంలో మొట్టమొదటిసారిగా భారతదేశం నుంచి నాకు "ప్రెసిడెంట్ అవార్డు" లభించిందని, అందుకుగానూ మా కంపెనీ ప్రధాన కార్యాలయం 'న్యూయార్క్'కు వెళ్లి నేను - నా శ్రీమతితో అవార్డు నందుకోవాలని. నా పై అధికారుల సంభాషణ సారాంశం. నోట మాట రాలేదు. అలాంటి అవార్డు ఉందని తెలుసుకానీ, నేను ఏ అవార్డు కోసంగానూ పని చేయలేదు. ఇది నేనే ఇచ్చాను అంటానికి సాయిముద్రిక - అవార్డు ప్రకటించే సమయానికి ఖచ్చితంగా నా శ్రీమతి నా ఇద్దరు చిన్నారులతో నా చెంతకు చేరడం. సుమారు 4000 మంది సంస్థ ఉద్యోగుల్లో నలుగురిని మాత్రమే విజేతలుగా ఎంపిక చేస్తారు. ఈ అవార్డు నా తర్వాత వందమందికి రావచ్చు. కానీ భారతదేశం నుండి నా విభాగంలో మొట్టమొదటిసారి నేను ఎంపికవ్వడమనేది కేవలం 'గురుకృప' మాత్రమే! ఇక్కడితో అయిపోలేదు సద్గురు లీలా వినోదం.

ప్రపంచంలో అత్యంత విలాసవంతమైన, ఖరీదైన న్యూయార్క్‌లోని 'టైమ్ స్క్వేర్' చేరుకొని, అవార్డు నందుకునేందుకు నా శ్రీమతితో 'అమెరికా సంయుక్త రాష్ట్రాలకు పయనమయ్యాను. విమానాల రద్దు కారణంగా ఎందరో ఇబ్బంది పడ్డా, నన్ను, నా శ్రీమతిని మాత్రం గురుదేవులు సకాలంలో న్యూయార్క్‌కు చేర్చారు. ఎంతో కొత్తగా, సద్గురు అనుగ్రహ విశేషంగా సాగిపోతున్నాయి క్షణాలు. నా శ్రీమతికి ఆహారమేదీ సరిపడకపోవడంతో తను పూర్తిగా నీరసించింది. రెండు రోజులు సరిగ్గా తినకపోవడంతో "డీ హైడ్రేషన్"కు గురయ్యి ఎంతో రద్దీగా ఉండే టైమ్ స్క్వేర్‌లో ఒక షాప్‌లో సొమ్మసిల్లి పడిపోయింది. తన శరీరంలో వచ్చిన మార్పును చూసిన ప్రతి ఒక్కరూ భయపడిపోయారు. వెంటనే లేవదీసుకుని తనను నా భుజంపై వేసుకుని, మేము విడిది చేసిన హోటల్‌కు తీసుకువెళదామని ప్రయత్నించాను. పరిస్థితి మరింత దిగజారింది. తను రోడ్డుమీదనే కూలబడిపోయింది. ఎవరి సహాయం పొందలేని నా స్థితి నిస్సహాయంగా మారిపోయింది.



గుండె పగిలేలా ఏడ్చాను. వైద్యంపట్ల నాకున్న అవగాహనలో తన నాడి కొట్టుకోవడం తగ్గిపోతోంది, శ్వాస అందడం లేదు. అలాంటి స్థితిలో ఒక అమెరికా జాతీయురాలు నా సద్గురువేనా అన్నట్లు తన కారును ఉన్నపళంగా ఆపివేసి, క్షణాల్లో నా శ్రీమతిని అక్కున చేర్చుకుంది. రూజ్‌వెల్ట్ హాస్పటల్‌కు ఫోన్ చేసి తక్షణ సహాయానికై అంబులెన్స్‌ను చెపుతూనే, నా శ్రీమతికి ప్రథమచికిత్స చేస్తూ, నాకు సూచనలిస్తూ తనకు సపర్యలు చేసింది ఆ స్త్రీమూర్తి. పోలీస్ అధికారులు ఆమె కారును రోడ్డుమీదనే పార్క్ చేసినందుకు మందలించడానికి చేసిన ప్రయత్నాలను కూడా పట్టించుకోలేదు. అనుక్షణం అనుగ్రహరారాజు నాతో(డు) ఉండి, నా శ్రీమతిని చూసుకున్న తీరు సహజమాతృత్వం కాక మరేమిటి? గురు'బంధువు'లు ఫోన్‌లో నన్ను గైడ్ చేస్తూ, తనకు, నాకు కొన్ని రోజులకు సరిపడా ఆహారాన్ని కూడా అందించారు. న్యూయార్క్‌లో రెండు రోజుల్లోనే తనను కోలుకునేలా చేయడం, మేము నయాగరా, వాషింగ్టన్ కూడా వెళ్లడం కేవలం సద్గురు అనుగ్రహ విశేషమే! జీవితంలో ఉన్న ఎన్నో కోణాలను చూపించడం, సరిదిద్దడం – సద్గురుసాయికే సాధ్యం. సప్త సముద్రాల ఆవలనున్నా సద్గురు అనుగ్రహం మాత్రం సదా మనతోడు ఉండటం–కేవలం సద్గురు సంకల్పమే!

అక్టోబర్ 1, 2013 నుండి దక్షిణ–తూర్పు భారతదేశానికి ఇన్‌చార్జ్‌గా కంపెనీ నాకు పదోన్నతినిచ్చింది. నాకు చాలా చిన్నతనంగా అనిపించింది. నా స్వామి దయతో నన్ను ఎటువంటి స్థితికి తెచ్చాడో గమనించుకుంటే! "మన ప్రయత్నంతో సాధించగలిగింది ఏమీ లేదు. కేవలం సద్గురు అనుగ్రహం మాత్రమే దేన్నైనా సాధ్యం చేయగలదు" అన్న సద్గురు వాక్యం స్ఫురణకొచ్చింది. ఇక్కడ కూడా స్వామి రాజముద్రిక ఏమంటే – పదోన్నతి ఖాళీ చెన్నైలో అయినా నేను ఎవ్వరినీ అడగకుండానే సంస్థ నన్ను హైదరాబాద్‌లో ఉంచడం. ఈ మధ్యనే గురుబంధువు మురళి నాతో అన్న మాటలు "అన్నా! మన దగ్గర ఎంత సత్తా ఉన్నా, సంస్థ చెత్తది అయినా సరే, లేదా – మనం చెత్తగా ఉన్నా, సంస్థ ఎంత గొప్పదైనా సరే మనల్ని మాత్రం బాబా ఒక్క క్షణం కూడా చిన్నగా ఉంచడు"

ఇక అసలు విషయానికొస్తా! దేశాలు తిరిగినా, అవార్డులొచ్చినా, నాకు 'ఆనందం' మాత్రం లేదు. చిరుద్యోగం, చిన్నజీతం – చక్కటి సత్సంగం – పౌర్ణమి సాయినామస్మరణ–వార్షికోత్సవాలు, పల్లకీసేవ– నా స్వామి గురించి నాలుగుమాటలు – చివరగా నా శ్రీమతితో ఏ హడావుడి లేకుండా సముద్రతీరంలో కాఫీ తాగే ఆ క్షణాలు. పరిగెత్తుతున్నా– ఈ పరుగుకు గమ్యం ఏమిటో తెలియదు. సత్సంగాన్నీ, ఉత్సవాలను, విలువైన సమయాన్ని, కోల్పోతున్నాననిపిస్తుంది. కొందరు గురుబంధువులు వృత్తిని, ప్రవృత్తినీ, కూడా చక్కగా సమతుల్యంగా నిర్వర్తించుకుంటారు. వారిని చూసి నేర్చుకోలేకపోతున్నానని నా భావన. ఏది ఏమైనా నా స్వామి దయగలవాడు – నన్ను ఏలుకోక మానడు. ఎందుకంటే బిడ్డ చేతగానితనం – తల్లికి తెలియదా! నాకూ ఆ పరిణితిని ఇస్తాడు. సందేహం లేదు. ఎడారిలో ఖర్జూరాలు ఎన్ని ఉన్నా ఒయాసిస్సుకున్న విలువ అంతా ఇంతా కాదు. **నా జీవితమనే ఎడారికి ఒయాసిస్సు 'గురుకృప.' –శ్రీనివాస్**

## బాబా పట్ల మనసు యాక్టివ్‌గా ఉండటమే నిజమైన యాక్టివిటీ

ఏ యాక్టివిటీ చేసినా బాబాను మనకు గుర్తు చేసేదానిగా ఉండాలి. మనకు బాబా పట్ల ఉండేటటువంటి ప్రేమ, బాబా వల్ల మనం పొందినటువంటి ఆనందాన్ని పదిమందితో పంచుకోవడం, మనం చేసుకునే యాక్టివిటీ వల్ల బాబా మీద మన ఫోకస్ ఇంకా ఇంకా ఆయన మీద పెరిగి, ... సాయి ఊసు, సాయి ధ్యాసగా మారాలి. మనం చేసే ఆ యాక్టివిటీ సాయి ఊసుని, సాయి ధ్యాసని మనలో పెంచేటువంటి విధంగా ఉందా లేదా? ఇవి చూసుకొని ఈ రెండు ఫుల్‌ఫిల్ దేనికైతే అది చేసుకోండి. ఏదైనా మంచి యాక్టివిటీనే. ఇవి కాకపోతే, ఇవి రెండుగాని చేయకపోతే ఏదీ మంచి యాక్టివిటీ కాదు. ఏ యాక్టివిటీ మనల్ని బాబాకు దగ్గర చేస్తోంది? మనలో బాబా స్మరణని ఎంత పెంచుతోంది? మనకు బాబాపట్ల ఉండేటువంటి ప్రేమను పదిమందితో పంచుకునే దానికి ఆ యాక్టివిటీ దోహదం చేస్తుందా? మనకి ఆనందాన్ని కలుగచేస్తోందా? ఇవి గమనించుకోండి. అంతే తప్పితే మనం ఇంత యాక్టివిటీ చేస్తున్నాం! మనం ఇంత సమాజసేవ చేస్తున్నాం, ఆర్గనైజ్ చేస్తున్నాం, నేను ఆర్గనైజర్‌ని, మిగతావాళ్లు ఫాలోవర్స్. ఇటువంటివి కాదు కావలసినది.

నువ్వు చేసేటువంటి యాక్టివిటీ వల్ల బాబాకు చేసేటటువంటి సేవేమీ లేదు. అది నీకు నువ్వు చేసుకునే సేవే. ఊరకనే అంటాం సాయిసేవ అని. సేవ అంటే ఆయనకు చేసేటువంటి ఒక ఊడిగం లాంటిది, ఒక సర్వీస్ లాంటిదది. అంతే తప్పితే హెల్ప్‌కాదది. అది ఆయనకు మనం చేసే ఉపకారం కాదు, మనకు మనం చేసుకునే ఉపకారం.

మానవసేవే మాధవసేవ, మనం మాధవసేవ చేస్తే మానవసేవ చేసినట్లే మళ్లీ! నిజమైన మాధవసేవ తెలిస్తే మానవసేవ చేయగలుగుతాం! నిజమైన మాధవసేవ తెలియకుండా చేసే మానవసేవ - మాధవసేవ ఎట్లా అవుతుంది? కాబట్టి మనం చేసే యాక్టివిటీలో మనం గమనించుకోవలసింది మూడు పాయింట్లు. మొదటిది మనం చేసుకునే యాక్టివిటీ మనలో సాయిఊసుని, సాయిధ్యాసని పెంచుతోందా? లేదా? రెండవది మనం చేసుకునే యాక్టివిటీ మనలో బాబా స్మరణని పెంచుకునే దానికి ఉపయోగపడుతోందా? లేదా? మూడవది బాబా పట్ల మనకున్న ప్రేమ, ఆయన ద్వారా మనం పొందిన ప్రేమను, ఆనందాన్ని ఇతరులతో పంచుకునేందుకు మనం చేసుకునే యాక్టివిటీ ఒక సాధనంలాగా ఉపయోగపడుతోందా? లేదా? మొదట రెండు అంశాల వల్ల మనలో అహంకారం, చిన్న చిన్న వంతులు, అసూయాద్వేషాలు, కీచులాటలు... ఇలాంటివన్నీ పోతున్నాయా? లేదా? మేము మొదటి, రెండు అంశాలను సరిగ్గానే చేసుకుంటున్నామని మీరు అనవచ్చు. అవి సరిగ్గా చేసుకుంటే ఈ కీచులాటలు, వంతులు... ఇవన్నీ ఉండవు. యాక్టివిటీ సరిగ్గా జరుగుతోందన్న దానికి గుర్తేమిటంటే బాబా పట్ల మనకున్నప్రేమ చక్కగా వ్యక్తీకరించబడుతుంటుంది. కాబట్టి మూడవ అంశంతో మొదటి రెంటినీ చెక్ చేసుకుంటూ వెళ్లండి. అప్పుడు మీ యాక్టివిటీ సరిగ్గా సాగుతుంది. **బాబా పట్ల మనసు యాక్టివ్‌గా ఉండటమే నిజమైన యాక్టివిటీ.**



- శ్రీబాబూజీ



# సత్సంగం

బాబా ప్రచారానికి కాదు. ఎవరినీ ఉద్ధరించడానికి కాదు.
దీని ద్వారా ఇంకేదో సాధించాలని కాదు.
బాబా యొక్క స్మరణలో ఉండటానికి.
బాబాను గుర్తు పెట్టుకోవడానికి.
బాబా పట్ల మన ప్రేమను పెంచుకోవడానికి.
బాబాకు మనల్ని మనం మరింత దగ్గర చేసుకోవడానికి
ఒక సాధనం మాత్రమే అని గుర్తు పెట్టుకుంటే ఏ సమస్యలూ రావు.
అది మరచిపోయినపుడే అన్ని సమస్యలూ వస్తాయి. - సాయిదీవెన